
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు





పోతిరెడ్డిపల్లి-రమణక్కపేట రోడ్డు



అద్దంలా రోడ్లు!

ఐదేళ్లపాటు రోడ్డు మార్గాలపై ఎటు వెళ్లాలన్నా నరకమే. గుంతలు తేలిన మార్గాలపై ప్రాణాలు కోల్పోయారెందరో. కనీసం తట్టెడు మట్టికి దిక్కులేకుండా పోయింది. ఆనాటి మంత్రులు, ఎమ్మెల్యేలకు రోడ్ల మీద జనం పడుతున్న బాధలు ఇసుమంతైనా పట్టలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం ఈ తరహా రోడ్డు మార్గాల్లో వంద రోజుల నిర్దిష్ట ప్రణాళిక రూపొందించుకుని సంక్రాంతి నాటికే మార్గాలన్నింటినీ చక్కబెట్టాలని నిర్ణయించగా ఇప్పటికే కొన్ని చోట్ల రహదారుల మరమ్మతులు పూర్తయ్యాయి. కొన్ని రోడ్లకు తిరిగి మహర్దశ పట్టింది.

- ఎక్కడికక్కడ గుంతల పూడ్చివేత
- ఆ దిశగానే కూటమి ప్రభుత్వం సంకల్పం, లక్ష్యాలు ఖరారు
- ఇప్పటికే కిలోమీటర్ల కొద్దీ రహదారులకు మరమ్మతులు
- ఊపిరి పీల్చుకున్న ప్రయాణికులు
- చాలా చోట్ల తగ్గిన ప్రమాదాలు
- గడువులోపే గోతులన్నీ పూడుస్తాం : ఎస్‌ఈ జాన్‌మోషే

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :
రాష్ట్రంలో రోడ్ల పరిస్థితిని చక్కదిద్ది మెరుగైన రవాణ, ప్రయాణవసతులు కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గుంతలులేని రోడ్ల కార్యక్రమంతో పెద్ద ఎత్తున మరమ్మతులకు రోడ్లు నోచుకున్నాయి. రోడ్లపై ప్రయాణించే ప్రజలు వాహనదారులకు ఇంతకుముందున్న కష్టాలు తీరబోతున్నాయి. రవాణ సాఫీగా సాగేందుకు, గుంతలు పూడ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు రెండు విడతలుగా 174 పనుల కింద రూ.97.90 కోట్లు మంజూరు చేసింది. గతంలో రోడ్ల మరమ్మతులకు నిధులు విదిల్చేందుకు అప్పటి జగన్ ప్రభుత్వం ఆపసోపాలు పడింది. కాని కూటమి ప్రభుత్వం జిల్లాలోని 682 కిలోమీటర్ల మేర రోడ్డు మార్గంలో పడిన గుంతలను పూడ్చి ప్రయాణం సాఫీగా సాగేందుకు చకచకా నిర్ణయాలు తీసుకుంటోంది. వంద రోజుల సమయం నిర్దేశించి సంక్రాంతి పండుగకు ముందే అన్ని రోడ్లను అద్దంలా మార్చి పండుగ కళ వచ్చేలా చూడాలని ఆయా శాఖలకు దిశ నిర్దేశం చేశారు. తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సాగిన కలెక్టర్ల సమావేశంలోనే మార్గాలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిందిగా సీఎం ఆదేశించారు. దీంతో రాబోయే కొద్ది రోజుల్లోనే మరమ్మతు పనులు పూర్తి చేసేందుకు ఆర్‌అండ్‌బీతోపాటు సంబంధిత శాఖలు రంగంలోకి దిగాయి. ఎస్‌ఈ దగ్గర నుంచి ఏఈ వరకు అధికారులంతా ఎక్కడికక్కడ స్వీయ పర్యవేక్షణ చేస్తున్నారు. గుంతలు లేని రోడ్ల కార్యక్రమానికి తొలివిడతలో రూ.22.24 కోట్లను మంజూరు చేశారు. ఈ పనులు ద్వారా రూ.158 కిలోమీటర్ల నిడివిన ఎక్కడికక్కడ దెబ్బతిన్న రోడ్లను ముందుగానే గుర్తించి మరమ్మతులు లక్ష్యంగా రంగంలోకి దిగారు. తొలి విడత పనుల్లో ఇప్పటికే 51 పనులకు టెండర్ ఖరారు చేసి 43 పనులను ప్రారంభించారు. దాదాపు 96 కిలోమీటర్ల మేర మరమ్మతులను పూర్తి చేశారు. అంటే మూడొంతుల మరమ్మతు పనులు దాదాపు పూర్తయ్యాయి. సంక్రాంతికి మరో 30 రోజులు గడువు మిగిలి ఉండగా ఆలోపే మిగతా పనులను పూర్తి చేసేందుకు లక్ష్యంగా ఎంచుకుని రంగంలోకి దిగారు.

రెండో విడతలో..

అలాగే నిర్దిష్టంగా తొలి విడత మరమ్మతుల కార్యక్రమం పూర్తి చేస్తూనే రెండో విడత పనులకు నిర్దిష్ట కార్యాచరణ రూపొందించింది. జిల్లా వ్యాప్తంగా 123 పనులకు 75.66 కోట్ల రూపాయలు మంజూరు చేసింది. ఈ పనులతో 523.7 కిలోమీటర్ల మేర దెబ్బతిన్న రోడ్లను మరమ్మతు చేస్తారు. రోడ్డు పక్కన పిచ్చి మొక్కల నిర్మూలనకు రంగం సిద్ధం చేశారు. దీనికిగాను రూ.95 లక్షలను మంజూరు చేసి టెండర్లను ఖరారు చేశారు. ఈ మరమ్మతు ప్రక్రియను సంక్రాంతిలోపే ముగించాలన్న లక్ష్యంతోనే చకచకా అడుగులు వేసింది. శాశ్వత ప్రాతిపదికన కొన్ని పనులను తొందరగా పూర్తి చేయాలని గడువును నిర్దేశించిందని, ఆ మేరకు శాఖాపరంగా వేగంగా అడుగులు వేస్తున్నామని ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ జాన్‌మోషే వెల్లడించారు.

నేడు సాగునీటి సంఘాల ఎన్నిక



- ఉదయం 8 నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభం
- ఒక్కరోజులోనే సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక పూర్తి
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం
- ఏకగ్రీవం దిశగా సంఘాలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :
ఏళ్ల తరబడి రైతులు ఎదురు చూసిన సాగునీటి సంఘాలకు నేడు ఎన్నికలు జరగబోతున్నాయి. ఐదేళ్లపాటు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం ఎన్నడూ ఈ దిశగా కనీసం సమీక్షించనూలేదు. రైతుల అభిప్రాయాలకు విలువ ఇచ్చి ఎన్నికల నిర్వహణకు అనువైన పరిస్థితులు సృష్టించలేదు. రెండు పంటలు పండించే గోదావరి జిల్లాల్లో ఈ సంఘాల కీలక పాత్రను ఆనాడు పాలకులు పూర్తిగా మరిచారు. కాని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోపే సాగునీటి సంఘాలకే కాకుండా డిస్ట్రిబ్యూటరీ, ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు నిర్వహించబోతుంది. దీనిలో భాగంగానే శనివారం జిల్లా వ్యాప్తంగా సుమారు 354 నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించి అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నికయ్యేలా చూడబోతున్నారు. ఉదయం నుంచి సాయంత్రంలోపు ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నేటి ఉదయం 8 గంటలకు ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులను ఎన్నుకోవడానికి వీలుగా అసాధారణ సర్వసభ్య మండలి సమావేశాన్ని ప్రారంభిస్తారు. ఆ తర్వాత 9 నుంచి 9.15 గంటల వరకు ఓటర్లకు నీటి వాడకందారుల ప్రధాన ఉద్దేశాలను, వాటి ప్రాదేశిక నియోజకవర్గ ఏకాభిప్రాయం ద్వారా గుర్తించాల్సిన అవసరాన్ని వివరిస్తారు. ఈ సందర్భంగా ఏకాభిప్రాయం కుదిరితే అంతా ఓకే. ఒకవేళ ఏకాభిప్రాయం కుదరని పక్షంలో 9.15 నుంచి 9.45 గంటల వరకు ఓటర్ల ఎంపికను చేతులెత్తి ప్రదర్శన లేదా ఓటింగ్ స్లిప్పుల ద్వారా ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తారు. ప్రాదేశిక నియోజకవర్గం పదాధికారి అభ్యర్థుల పోటీదారుల నుంచి నామినేషన్లను 9.45 నుంచి 10.15లోపు స్వీకరిస్తారు. ఆ తర్వాత తుది జాబితాను ప్రకటిస్తారు. 10.30 నుంచి మధ్యాహ్నం 12.30లోపు రెండు గంటల సమయంపాటు ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులను ఎన్నుకునే ప్రక్రియను నిర్వహిస్తారు. ఇది పూర్తయిన వెంటనే ఓటింగ్ స్లిప్పుల లెక్కింపు, ఫలితాల ప్రకటన ఒంటిగంటకు పూర్తి చేస్తారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అధ్యక్షులు, ఉపాధ్యక్షులను ఎన్నుకోవడానికి ప్రత్యేక యాజమాన్య కమిటీ సమావేశం నిర్వహిస్తారు. ఈ యావత్ ప్రక్రియను సజావుగా సక్రమంగా నిర్వహించేందుకు వీలుగా ఇప్పటికే అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశారు.

దాదాపు ఏకగ్రీవమే..

ప్రస్తుతం జిల్లాలో కూటమి పక్షాన ఎమ్మెల్యేలదే పైచేయి కావడంతో నీటి సంఘాల ఎన్నికల్లోను ఇదే ధోరణిలో పూర్తి చేస్తారని భావిస్తున్నారు. సంఘాలకు పోటీ జరిగిన అవికూడా కడకు కూటమికి అనుకూల ఫలితాలు వచ్చేలా జాగ్రత్తపడే అవకాశం లేకపోలేదు. పోలవరం, ఉంగుటూరు నియోజకవర్గాల నుంచి జనసేన ఎమ్మెల్యేలు చిర్రి బాలరాజు, ధర్మరాజు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ రెండు నియోజకవర్గాల్లోను కూటమి పక్షాన అనుకూలురే అత్యధిక పోటీలో ఉన్నారు. వైసీపీ ఎలాగూ నాయకత్వలోపం ఎదుర్కొంటున్న తరుణంలో ఈ ఎన్నికల్లో పోటీ పడేందుకు ఆ పార్టీ పక్షాన ఎవరూ పెద్దగా ఉత్సాహపడడంలేదు. అలాగే కైకలూరులో బీజేపీ పక్షాన ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ప్రాతినిధ్యం వహిస్తుండగా టీడీపీ పక్షాన దెందులూరులో చింతమనేని ప్రభాకర్, ఏలూరులో బడేటి చంటి, చింతలపూడి నుంచి రోషన్‌కుమార్‌తోపాటు మంత్రి కొలుసు పార్థసారథి నూజివీడు నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరంతా ఇప్పటికే సాగునీటి సంఘాల ఎన్నికలను పర్యవేక్షించారు. కూటమి పక్షాన సానుకూలురు విజయానికి పూర్తి సంకేతాలు ఇచ్చారు. అక్కడక్కడ వైసీపీ సానుభూతిపరులు పోటీలకు దిగినా ఫలితాల్లో పెద్ద తేడా ఉండదని కూటమి నాయకత్వం ధీమాగా ఉంది.


ఏలూరులో వాహనాలు తనిఖీ చేస్తున్న త్రిటౌన్ ఎస్‌ఐ రాంబాబు

జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీలు

ఏలూరు క్రైం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకూ విస్తృతంగా వాహనాలు తనిఖీ చేసి గస్తీ నిర్వహించారు. జిల్లాలోని జాతీయ, రాష్ట్రీయ ఇతర రహదారుల మార్గాల్లో రాత్రి వేళల్లో బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, వంటరి మహిళలకు రక్షణ కల్పిస్తూ పకడ్బందీగా గస్తీ విధులు, రోడ్డు ప్రమాద నివారణ కోసం రాత్రి పూట వాహన డ్రైవర్లకు ఫేస్‌వాష్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని ఏటీఎంలు, దేవాలయాలు, చర్చిలు, మసీదులు వద్ద పోలీసులు గస్తీ నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. లాడ్జీలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో కొత్త వ్యక్తుల సమాచారాన్ని తెలుసుకుని వారిని ప్రశ్నించారు.

ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో
ప్రసవానికి లంచం డిమాండ్



- ఉద్యోగులు సొమ్ము వసూలు చేస్తుండగా వీడియో తీసిన మహిళ
- ఉన్నతాధికారులకు ఫిర్యాదుతో ఆస్పత్రిలో విచారణ

7

సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్య

- చిత్తపూరు యువతి
- హైదరాబాద్‌లో మృతి
- భార్యాభర్తల గొడవలే కారణమా?

7

పోక్సో కేసులో నిందితుడికి జీవిత ఖైదు

- బాధితురాలికి రూ.3లక్షల పరిహారం ఇవ్వాలని కోర్టు ఆదేశం

7


సీపీఎం జిల్లా మహాసభలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

నిర్వాసితుల సమస్యల పరిష్కారంలో
ప్రభుత్వాల విఫలం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఉమామహేశ్వరరావు
- బుట్టాయగూడెంలో సీపీఎం జిల్లా మహాసభ

బుట్టాయగూడెం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పోలవరం జాతీయ ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసిత గిరిజనుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమైనట్టు సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఉమామహేశ్వరరావు తెలిపారు. బుట్టాయగూడెంలో శుక్రవారం జరిగిన సీపీఎం 26వ జిల్లా మహాసభలో పాల్గొని మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ.. 'నిర్వాసితులకు ఇంతవరకు పూర్తిస్థాయిలో పరిహారం అందలేదు. పరిహారం కోసం గిరిజనులు కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నా అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. ప్రాజెక్టు కోసం త్యాగం చేసినవారిని ఇలానే వదిలేస్తారా?. రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయి. కూలీలు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ చార్జీలను పెంచమని ఎన్నికలకు ముందు ఊదరగొట్టిన చంద్రబాబు అధికారంలోకి రాగానే 13 వేల కోట్ల రూపాయల భారాన్ని ప్రజలపై మోపారు'. అన్నారు. తొలుత శివాలయం నుంచి సభాప్రాంగణం వరకు డోలు వాయిద్యాలు, గిరిజన సంప్రదాయ నృత్యాలతో ర్యాలీ, భారీ ప్రదర్శన నిర్వహించారు. జిల్లా మహాసభకు అధిక సంఖ్యలో గిరిజనులు తరలిరావడంతో మండల కేంద్రం ఎర్రజెండాల రెపరెపలతో ఎరుపు రంగు పులుముకుంది. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మంతెన సీతారామ్, నాయకులు ఎ.రవి, తెల్లం రామకృష్ణ, తెల్లం దుర్గారావు, అందుగుల ఫ్రాన్సిస్, మొడియం నాగమణి, తామా ముత్యాలమ్మ, ఉడతా వెంకటేశ్, కారం భాస్కర్, జి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.


భారీ ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు, గిరిజనులు

సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి : ఎస్పీ

ఏలూరు క్రైం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సిబ్బంది సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తానని జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ హామీ ఇచ్చారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ సిబ్బంది సంక్షేమ దివాస్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. పోలీస్ సిబ్బంది సమస్యలపై వినతులను ఎస్పీ స్వీకరించి వాటి పరిష్కారానికి అప్పటికప్పుడే ఆదేశాలు జారీ చేశారు. పోలీస్ సిబ్బందితో పాటు ఏఆర్ సిబ్బంది, హోంగార్డులు తమ సమస్యలపై వినతులు అందించారు.

నేడు జాతీయ లోక్‌అదాలత్

ఏలూరు క్రైం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని కోర్టులలో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్టు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ తెలిపారు. ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో శనివారం ఉదయం 10 గంటలకు జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమం నిర్వహి స్తారని తెలిపారు.

రూ.512.32 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు : జేసీ

ఏలూరుసిటీ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : 2024-25 ఖరీఫ్ పంట కాలానికి సంబంధించి నేటి వరకు 240 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 28,851 మంది రైతుల నుంచి రూ.512.32 కోట్ల విలువైన 2,22,876.600 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు జేసీ ధాత్రిరెడ్డి తెలిపారు. రైతులు కోరిన రైస్ మిల్లులకు తరలించేందుకు 71,23,817 గోనె సంచులను 2260 వాహనాలను వినియోగించినట్టు తెలిపారు. ఇప్పటిరకు రూ. 403.32 కోట్లను రైతుల ఖాతాలలో జమ చేశారని, మిగిలిన రూ. 101.69 కోట్లు జమ చేసే ప్రక్రియలో ఉందన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ (కంట్రోల్ రూమ్ నెంబర్లు 08812-230448, 7702003584 , టోల్‌ఫ్రీ 18004256453) ద్వారా మానిటరింగ్ చేస్తున్నామన్నారు.

ఆదమరిస్తే.. అంతే సంగతులు!

ఏలూరులో ప్రమాదకరంగా ఫ్లయ్ ఓవర్లు, వంతెనలు



నిమ్మకాయల మార్కెట్ సమీపంలోని వంతెన ఇలా..

ఏలూరులోని ఫ్లయ్‌ఓవర్ బ్రిడ్జిలు, కాల్వలపై నిర్మించిన వంతెనలు నిర్వహణ పనులు చేపట్టక పోవడంతో గోతులతో అధ్వానంగా మారాయి. వాహనదారులు గోతుల బారి నుంచి తప్పించుకునే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. జూట్ మిల్లు వద్ద, మార్కెట్‌యార్డు, పాత బస్టాండు సమీపంలోని ఫ్లయ్‌ఓవర్లు, అశోక్ నగర్ వద్ద తమ్మిలేరుపై, పాత బస్టాండ్ వద్ద కృష్ణా కాల్వ మీద నిర్మించిన వంతెన లు నిత్యం రద్దీగా ఉంటాయి. ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉన్న వీటికి మొక్కుబడిగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకోవ డంతో ప్రమాదకరంగా మారాయి. ముఖ్యంగా వంతెనలు పాడవడానికి భారీ గ్రానైట్ బ్లాకులు, క్వారీరాళ్ళు, గ్రావెల్ రవా ణా చేసే వాహనాలు రాకపోకలు సాగించ డమే ప్రధాన కారణమన్న విమర్శలున్నాయి. రోడ్డుతో పాటు డివైడర్‌లు, ఫుట్‌పాత్‌లు, ఛిద్రం అయ్యాయి. రక్షణ గోడలు ధ్వంసమై సిమెంట్ రెయిలింగ్ కొన్నిచోట్ల పడిపోయింది. ఫుట్‌పాత్‌లపై పలకలు విరిగి పాదచారులు ఇబ్బంది పడుతు న్నారు. వీటి దుస్థితి గురించి ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేసినా నిధులు లేవంటూ సమాధానం చెబుతున్నారని నగరవాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

- ఏలూరు రూరల్



అశోక్ నగర్ ఫ్లయ్‌ఓవర్ ఫుట్‌పాత్ దుస్థితి




ఫైర్‌స్టేషన్ ఫ్లయ్ ఓవర్ రక్షణగోడ దుస్థితి

సైబర్ నేరాలపై అప్రమత్తం చేయాలి : ఎస్పీ

ఏలూరు క్రైం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పెరుగుతున్న సాంతకేతిక పరిజ్ఞానాన్ని ఆసరాగా తీసుకుని సైబర్ నేరగాళ్లు నేరాలకు పాల్పడుతున్నారని ఇలాంటి వారి మోసాల బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత విద్యార్థులు తీసుకోవాలని ఎస్పీ కేపీఎస్ కిశోర్ సూచించారు. ఏలూరు కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా పోలీస్, గ్రామ దీప్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న స్టూడెంట్ అంబాసిడర్ పబ్లిక్ సేఫ్టీ ట్రైనింగ్ వర్క్‌షాపును ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మొబైల్ ద్వారానే 80 శాతం సైబర్ నేరాలు జరుగుతున్నాయన్నారు. విద్యార్థి దశ నుంచే సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండి సమాజంలో మరింత మందికి తెలిపి అంబాసిడర్లు కావాలన్నారు. సైబర్ నేరానికి గురైతే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం అందించాలన్నారు. బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడేవారిపై, కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఈ రెండు రోజుల్లో 150 మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తారన్నారు. జేసీ ధాత్రిరెడ్డి, అదనపు ఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు, గ్రామ దీప్ సంస్థ నిర్వాహకురాలు డాక్టర్ మనోహరి, భూమిక సంస్థ లీగల్ అడ్వైజర్ జి.అనుపమ, తెలుగు రాష్ట్రాల సోషల్ సర్వీస్ ప్రతినిధి కె.శాంతారామ్, ఎస్‌ఈఆర్‌పి ప్రతినిధి సీఏ ప్రసాద్, డీఎస్పీ శ్రావణ్ కుమార్ సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం. సుబ్బారావు, ఎస్ఐ కాంతిప్రియ, సైబర్ సెల్ ఎస్ఐ మధు వెంకటరాజా, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, పోలీసు అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్





విచిత్ర వేషధారణలు



శ్రీఆంజనేయం.. ప్రసన్నాంజనేయం..

వైభవంగా నందమూరుగరువు ఆంజనేయుడి గ్రామోత్సవం

వీరవాసరం (భీమవరం టౌన్) డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వీరవాసరం మండలం నందమూరుగురువులో శ్రీరామ భక్త ఆంజనేయస్వామి వారి 59 వార్షికోత్సవ హనుమద్వ్రత మహోత్సవాలు శుక్రవారం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం 5-45 నిమిషాలకు కొప్పినీడి శ్రీనివాసరావు, లక్ష్మీ కృష్ణకుమారి దంపతులచే కలశస్థాపనతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు స్వామివారి గ్రామోత్సవం ప్రారంభించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో సీతారామ చ్రంద స్వామి ఉత్సవ మూర్తులను ఉంచిన అనంతరం బాణసంచా కాల్పులతో, మంగళవాయిద్యాలతో గ్రామోత్సవం ప్రారంభమైంది. రామభక్త హనుమాన్‌లు, మహారాష్ట్ర కళాకారులు మహిళా ట్రూపు డప్పులు, కోయ డ్యాన్సులు, బుట్టబొమ్మలు, ఇలా వివిధ కళారూపాలతో ఊరేగింపు సాగింది. రాత్రి ఆలయం వద్ద భారీ బాణసంచా కాల్చారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. 13 రోజులు పాటు ఉత్సవాలు జరుగుతాయి. 25న అన్న సమారాధనతో ముగుస్తాయి.





ఊరేగింపులో వివిధ రాష్ట్రాల కళా ప్రదర్శనలు









జంగారెడ్డిగూడెం భక్తాంజనేయస్వామికి లక్ష తమలపాకుల పూజ

ఘనంగా హనుమద్ వ్రతాలు

జంగారెడ్డిగూడెం/ద్వారకాతిరుమల డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి : మండలంలోని గురవాయిగూడెం మద్ది అంజనేయస్వామి క్షేత్రంలో శుక్రవారం మనుమద్ వ్రతం ఘనంగా నిర్వహించినట్టు ఆలయ ఈవో ఆర్‌వీ చందన తెలిపారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోని గంగానమ్మ ఆలయం వెనుక ఉన్న భక్తాంజనేయస్వామి ఆలయంలో మనుమద్ వ్రతం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి లక్ష తమలపాకుల పూజ నిర్వహించారు. ఆలయం వద్ద జరిగిన ప్రత్యేక పూజల్లో ఇరవై మంది దంపతులు పాల్గొన్నారు. ఇంది రానగర్ కాలనీ వద్ద ఉన్న శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో కమిటీ అధ్య క్షుడు వలవల తాతాజీ, సుశీల దంపతుల ఆధ్వర్యంలో మనుమద్‌వ్రతం నిర్వ హించారు. స్వామివారికి తమలపాకుల పూజ నిర్వహించారు.



తమలపాకులపై శ్రీరామ అని రాస్తున్న వేద పాఠశాల విద్యార్థులు

ద్వారకాతిరుమలలో...

ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్ర ఉపాలయమైన అంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. అర్చకులు, పండితులు స్వామి వారిని విశేష పుష్పాలంకారాలు చేశారు. పంచామృతస్నపన, సహస్ర నాగావళి పూజలు నిర్వహించారు. ఆగమ విద్యార్థులు పాల్గొని ప్రతీ తమలపాకుపై శ్రీరామ అని రాసి అర్చకులకు అందజేయగా వాటితో అంజనేయునికి ప్రత్యేక పూజలు చేశారు.

నేత్రపర్వం .. శ్రీవారి తిరువీధి సేవ



ద్వారకాతిరుమల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): చినవెంకన్నకు శుక్రవారం రాత్రి క్షేత్ర పురవీధుల్లో జరిగిన తిరువీధిసేవ భక్తు లను అలరించింది. కృత్తికా నక్షత్రం పురస్క రించుకుని ముందుగా ఆలయంలో స్వామి, అమ్మవార్లను తొళక్క వాహనంపై ఉంచి అర్చకులు ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా అట్టహాసంగా తిరువీధులకు తీసుకొచ్చారు. ప్రతీఇంటి ముందు భక్తులు స్వామివారి, అమ్మవార్ల మూర్తులకు హారతులు పట్టారు.



నాట్య సమ్మోహనం.. అలరించిన నృత్య పోటీలు

ఏలూరు రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అద్భుత నృత్య సమ్మోహనంతో ప్రాంగణం పులకించింది. అభినయ నృత్య భారతి వార్షికోత్సవం సందర్భంగా ఏలూరు సెల నాగకోటేశ్వరరావు కల్యాణ మండపంలో 29వ వార్షికోత్సవం పురస్కరించుకుని జాతీయ స్థాయి, కూచిపూడి, జానపద బృంద నృత్య పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కూచిపూడి, భరతనాట్యం, కదక్, ఒడిస్సీ నృత్యాలు విశేషంగా అలరించాయి. ఉదయం జూనియర్, సబ్ జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. కళాకారులు తమ నాట్య ప్రదర్శనతో ఆహూతులను మంత్ర ముగ్ధులను చేశారు. నాట్యంలో విశేష సేవలు అందించిన వారికి నృత్య తపశ్వి, సేవా తపశ్వి అవార్డులు నృత్య కౌముది అవార్డులను ప్రదానం చేశారు. పోటీ లను నంది అవార్డు గ్రహీత కేవీ సత్య నారా యణ, గోశాల రాష్ట్రకార్యదర్శి ఎం.మురళీకృష్ణ, విజయలక్ష్మి దంపతులు ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ, ఆలపాటి నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, దివ్వి రామారావు పాల్గొన్నారు. మూడురోజుల పాటు పోటీలు జరగనున్నాయి. నాట్యాచార్య దివ్వి హేమసుందర్ పర్యవేక్షించారు.



రైతులు దాళ్వా నారుమడులను సిద్ధం చేసుకుంటున్నారు. ఓవైపు సార్వా పనులు సాగుతుండగానే మరోవైపు రైతులు దాళ్వా పనుల్లో నిమగ్నమైపోయారు. ఈ ఏడాది సార్వా సాగు ఒడిదుడుకుల మధ్య సాగింది. వాటి నుంచి తేరుకోకముందే రైతులు దాళ్వాకు సన్నద్ధమయ్యారు. పాలకోడేరు మండలంలో ఇప్పటికే చాలాచోట్ల నారుమడులు నారుమడులు వేశారు. - **పాలకోడేరు**

ఇంధనం ఆదా చేద్దాం..



పెరిగిన వాహనాలు

పెట్రోల్, డీజిల్‌పైనే ఆధారం

విద్యుత్ వినియోగంలోనూ తగ్గేదేలే..

ఇంధన పొదుపుతోనే పర్యావరణానికి మేలు

నేడు జాతీయ ఇంధన పొదుపు దినోత్సవం

ఆకివీడు రూరల్ /ఏలూరు కార్పొరేషన్ డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి):ఇంధనాన్ని పొదుపుగా వినియోగించు కోవాలన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డిసెంబర్ 14వ జాతీయ ఇంధన దినోత్సవం నిర్వస్తున్నారు. గత దశాబ్దంతో పోలిస్తే ఇంధన వినియోగం రెట్టింపు అయ్యిందని శాస్త్రవేత్తలు, పర్యావరణ వేత్తలు తెలియచేస్తున్నారు. పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ వినియోగం ఎక్కువైంది. 2030 నాటికి మరింత పెరిగే అవకాశం ఉంది. నానాటికి వాహనాల సంఖ్య పెరుగుతుంది. ఇంధన వనరుల వినియోగం తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షించుకోకపోతే భావితరాలకు ఇబ్బందులు తప్పవని శాస్త్రవేత్తలు తెలియజేస్తున్నారు.



బతకడానికి ఇంధనం చాలా అవసరం. ఇంధనం లేకుండా జీవితమే లేదంటే అతిశయోక్తి లేదు. కాలుతీసి కాలు బయట పెట్టాలంటే ఇంధనం లేనిదే అవదు..ప్రస్తుత సమాజం ఇంధనంపై అంతలా ఆధారపడి ఉంది. ప్రధానంగా విద్యుత్, పెట్రోలు, గ్యాస్ ప్రజలకు అత్యవసరమైన ఇంధనాలు. వినియోగం పెరిగిపోయి, ఉత్పత్తులు తగ్గిపోతున్న వేళ ఉన్న వాటిని ఏవిధంగా పొదుపుగా సద్వినియోగం చేసుకుంటే భవిష్యత్ తరాలకు ఇంధనం కొరత రాకుండా ఉంటుందో ఆలోచించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైన ఉంది. ఈ మూడు జీవనంలో భాగస్వాములయ్యాయి. అవి లేకుండా రోజు గడవని పరిస్థితి. విద్యుత్ ప్రతి ఒక్కరికి అత్యంత అవసరమైన ఇంధనం. నీరు, బొగ్గు, సూర్యరశ్మి నుంచి విద్యుత్ ఉత్పత్తి అవుతున్నది. అయితే ఉత్పత్తి తక్కువగా ఉండి, వినియోగం ఎక్కువగా ఉండటంతో అధిక ధరలు పలుకుతున్నాయి. సోలార్ విద్యుత్‌పై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కలగలేదు. ప్రస్తుతం విద్యుత్‌ను ఆదా చేస్తే ఉత్పత్తి చేసిన ట్లేనని నిపుణులు తెలియజేస్తున్నారు. విద్యుత్‌ను ఉపయోగించుకుని బిల్లులు అధికంగా రాకుండా, భావి తరాలకు విద్యుత్ కొరత రాకుండా తగిన చర్యలు చేపట్టాలి.

ప్రమాణాలు పాటిస్తే ఇంధనం ఆదా



వాహనాలను నడిపే సమయంలో ఆయా వాహనాలు మ్యాన్యువల్‌ను తప్పనిసరిగా పాటించాలి. వాహనాలు నడిపే సమయంలో క్లచ్ తప్పనిసరి అయితే తప్ప ఉపయోగించకూడదు. వేగంగా నడపకూడదు, వేగంగా నడ పడం ఒక్కసారిగా వేగం తగ్గించడం, వంటివి చెయ్యకూడదు. గేర్‌లు ఉపయో గించే పద్ధతిలో వేగాన్ని బట్టి చెయ్యాలి. పరిమితిని మించి వాహనాలపై వెళ్లినా మైలేజీ రాదు. వాహనాలను ఎప్పటికపుడు సర్వీసింగ్ చేయిస్తుండాలి. ప్రణాళిక ప్రకారమే ప్రయాణాలను నిర్ణయించుకోవాలి. ప్రయాణంలో మ్యాప్‌లను ఉపయోగించి సక్రమంగా ఉన్న రహదారులపై ప్రయాణించాలి. ఆయా పరిస్థితులకనుగుణంగా జాగ్రత్తలు పాటిస్తూ ఇంధనా లను పొదుపు చేసి భావి తరాలకు ఇంధనాల కొరత రాకుండా బాధ్యతగా వ్యవహరించాలి.

-మోటుపల్లి రాజు, మెకానిక్

జాగ్రత్తలు తీసుకుంటే గ్యాస్ ఆదా



గ్యాస్ వినియోగంలో ఎక్కువగా చిన్న బర్నర్‌లను ఉపయోగించాలి. గ్యాస్ పొయ్యికి గాలి తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. వంట చెయ్యడానికి ముందుగానే అన్ని వస్తువులు దగ్గర ఉంచుకోవాలి. కుక్కర్లను వినియోగించడం ద్వారా గ్యాస్ ఆదా అవుతుంది. మందం తక్కువగా ఉన్న పాత్రలను ఉపయోగించుకోవాలి. గ్యాస్ స్టవ్‌కు ఉపయోగించుకునే రబ్బర్ ట్యూబ్ సమయానికి మార్చుకోవాలి. బర్నర్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి. లైటర్ లేదా అగ్గిపుల్ల వెలిగించిన తరువాతే బర్నర్‌ను ఆన్ చేసుకోవాలి.

- జ్యోతి, గృహిణి, సిద్ధాపురం

అనవసర వినియోగాన్ని తగ్గించాలి



వ్యాపార సముదాయాలు, గృహావసరాలలో ముందుగా అనవసర వినియోగాన్ని గుర్తించాలి. ప్రధానం ఏసీలు, ఫ్రిజ్‌లు, ఫ్యాన్‌లు గ్రీజర్‌లు, ఓవెన్స్ వంటి వాటిని ఉపయోగించేటప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలి. ఏసీ లేని నివాసాలు లేవు. ఏసీలను ఆన్ చేసే సమయంలో టెంపరేచర్ కొంతమంది 16లో పెడతారు, దీని వల్ల ఏసీ ఎక్కువగా వస్తుందని అనుకుంటారు, దీని వలన విద్యుత్ వినియోగం ఎక్కువగా అవుతుందే తప్ప ఉపయోగ ముండదు. 24లో ఉంచి ఉపయోగిస్తే ఏసీ మీద భారం పడదు. విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉండదు. గది కూడా త్వరగా కూల్ అయ్యే అవకాశం ఉంటుంది. ఫ్రిజ్‌లు కూడా ఫ్రిజ్‌లో పెట్ట కూడదు. ఫ్రిజ్ డోర్‌లు అస్తమాను తీస్తు వేస్తూ ఉండకూడదు. తక్కువ విద్యుత్ వినియోగమయ్యే ఎల్ఈడీ బల్బులనే వాడాలి, ఫ్యాన్‌లను రెగ్యులేటర్లతో ఉపయోగించుకోవాలి. గ్రీజర్ల విని యోగంలో కూడా సమయాన్ని ఉపయోగించుకోవాలి. అలంకరణ లైట్లు వినియోగం తగ్గించాలి.ఎప్పటికప్పుడు స్విచ్‌లు కట్టివేసి ఉంచాలి.

- ప్రదీప్, ఏఈ, విద్యుత్ శాఖ



జీవిత సాఫల్య పురస్కారం అందుకుంటున్న బి.గోపాల్

ఉద్యాన ఉపకులపతి గోపాల్‌కు జీవిత సాఫల్య పురస్కారం

తాడేపల్లిగూడెం రూరల్ డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయ ఉపకులపతి డాక్టర్ బి.గోపా ల్‌కు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం జీవిత సాఫల్య పురస్కారం అందించారు. హైద్రాబాద్‌లోని రాజేంద్రనగర్ వర్శి టీలో గురువారం ఇండియన్ ఫైటో పాథాలజీ, ఇన్నోవేటివ్ అప్రోచెస్ ఇన్‌ప్లాంట్ డిసిజ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సదస్సులో ఈ అవార్డు అందించారు. తీపి నారింజ, పులుపు నిమ్మ, ఉల్లి, పసుపు వంటి సుగంధ ద్రవ్యాల రూపకల్పనలో ప్రతిభ కనబరిచినందుకు ఈ పురస్కారం అందించారు.



రథాలను ప్రారంభిస్తున్న వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి సత్య రవికుమార్

హైందవ శంఖారావం ప్రచార రథాలు ప్రారంభం

ఏలూరు రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): హిందు దేవాలయాల స్వయంప్రతిపత్తి కోరుతూ వీహెచ్‌పీ ఆధ్వర్యంలో జనవరి 5న గన్నవరంలో నిర్వహించనున్న బారీ బహిరంగ సభలో ప్రతిఒక్క హిందువు పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యదర్శి తణికెళ్ళ సత్యరవికుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఏలూరు పాత బస్టాండు సెంటర్లోని పాండురంగస్వామి ఆలయం వద్ద హైందవ శంఖారావం సభకు సంబంధించి ప్రజల్లో చైతన్యం కోసం ప్రచారానికి గారపాటి సీతారామాంజనేయ చౌదరి ఏర్పాటుచేసిన రెండు ప్రచార రథాలను రవికుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 25 లక్షల కుటుంబాలను నేరుగా కలవడానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.



చిన్నారుల భవితకు బాసట

దివ్యాంగులకు ఆసరాగా భవిత కేంద్రాలు

విద్యతో పాటు ఫిజియోథెరపీ

కైకలూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాల కల్గిన పిల్లలకు భవిత కేంద్రాలు బాసటగా నిలుస్తున్నాయి. విద్యాశాఖ సమగ్రశిక్షా ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ కేంద్రాలపై గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా బోధకులకు, పిల్లలకు బకాయిలు సకాలంలో చెల్లించకపోవడంతో ఇబ్బందులను ఎదుర్కొన్నారు. దీంతో వివిధ రకాల వైకల్యాలు ఉన్న చిన్నారులు పలు సేవలకు దూరమయ్యారు. ప్రస్తుతం ప్రభుత్వం ఫిజియోథెరపీ సేవలు పునరుద్ధరించడంతో పాటు వివిధ అంశాలపై దృష్టి సారించి చిన్నారుల భవితకు బాటలు వేస్తోంది. కైకలూరుభవిత కేంద్రంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక అవసరాలు కల్గినవారు సుమారు 22 మంది పిల్లలున్నారు. వీరికి విద్యను అందించేందుకు ప్రత్యేక ఉపాధ్యాయులు చెవిటి, మూగ పిల్లలకు సేవలు అందిస్తున్నారు. సాధారణ కదలికలు, కండరాల్లో వైకల్యం, మెదడు అభివృద్ధి లోపం, నరాల బలహీనత బారిన పడిన పిల్లలకు ఈ కేంద్రంలో ఫిజియోథెరపీ సేవలు అందుతున్నాయి. భవిత కేంద్రాల్లో విద్యను అభ్యసించే ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు రాను, పోను రవాణా, అంగరక్షక భత్యాలు వేరువేరుగా నెలకు రూ.300 చొప్పున ఇవ్వాలి. బాలికలకు ప్రత్యేక భత్యాలు రూ.2 వేలు, అలవెన్సు, రీడర్ అలవెన్స్, హెచ్‌పీ అలవెన్స్, స్పీచ్ థెరపి, కళ్లజోళ్ల ఎంఆర్ కిట్లు సమకూర్చాల్సి ఉంది. అంతేకాకుండా



బిహేవియర్ మాడిఫికేషన్, విచిత్ర ప్రవర్తన అదుపునకు కృషి బాహ్య స్ర్కీనింగ్, తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేస్తూ విద్యాబోధన సాగిస్తున్నారు. మానసిక దివ్యాంగులు అయినప్పటికీ వారిలో చదవడం, రాయడం, సంఖ్యలు గుర్తింపు, లెక్కింపు, డబ్బులు లెక్కింపు, నిత్య జీవితంలో అవసరమైన పనులు, స్వతహాగా చేసుకోవడం, సమాజాన్ని అర్థం చేసుకుని పరిస్థితులకు అనుగుణంగా స్పందించడం వంటి విషయాల్లో తర్ఫీదు ఇస్తున్నారు. ప్రతి విద్యార్థి తన పేరు, చిరునామా, ఇంగ్లీషులో సంతకాలు చేసి మేము సైతం అన్నట్లుగా తీర్చిదిద్దడం తమే లక్ష్యమని అక్కడి బోధకులు వివరిస్తున్నారు. ఈ ఏడాది 10వ తరగతి పరీక్షలకు తమ కేంద్రం నుంచి నలుగురు విద్యార్థులు స్రైబ్ సహకారంతో హాజరయ్యేలా సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. వైకల్య సమస్య అతీతంగా ఉండి భవితకేంద్రం వరకు రాలేని పిల్లలుకు ఇంటికి వెళ్లి విద్యను అందించడంతో పాటు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ కూడా నిర్వహిస్తున్నట్లు వివరించారు. వీరికి ఆఫ్ బేస్డ్ అలవెన్సు రూ.3 వేలు అదనంగా అందిస్తున్నారు. ప్రభుత్వం ప్రతీ ఒక్క ప్రత్యేక అవసరాలు కల్గిన పిల్లలకు ఈ సొమ్ములను వారి సొంత కాతాల్లో జమ చేయడం జరుగుతుంది.

ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో

ప్రసవానికి లంచం డిమాండ్

ఉద్యోగులు సొమ్ము వసూలు చేస్తుండగా వీడియో తీసిన మహిళ

ఉన్నతాధికారులకు ఫిర్యాదుతో ఆస్పత్రిలో విచారణ


ఆస్పత్రిలో వివరాలు తెలుసుకుంటున్న తహసీల్దార్

ఏలూరు క్రైం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో కొద్ది రోజుల క్రితం జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి రెండు గంటల పాటు పరిశీలించారు. అవినీతి జరిగితే సహిం చేది లేదని హెచ్చరికలు జారీ చేశారు. అయినా ఆసుపత్రి మాతా శిశు విభాగం ఉద్యో గుల తీరు మారలేదు. వారికి లంచం ఇవ్వనిదే ఏ పని జరగదని ప్రచారం కూడా ఉంది.

ఒక మహిళ ప్రసవానికి ఆస్పత్రికి వెళితే ఆమె బంధువుల వద్ద నుంచి అడుగడుగునా ఆసుపత్రి ఉద్యోగులు లంచం వసూలు చేశారని ఆ మహిళ ఆరోపించింది. ఒక వీడియో తీసి ఉన్నతాధికారులకు పంపించడంతో జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి విచారణకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఏలూరు అర్బన్ తహసిల్దార్ శేషగిరి శుక్రవారం ఆసుపత్రి చేరుకుని సాయంత్రం 6.30 గంటల వరకూ ప్రాథమిక విచారణ చేశారు. తల్లి బిడ్డల విభాగాన్ని అడు గడుగునా ఆయన పరిశీలించి వివరాలు సేకరించారు. పెదపాడు మండలం కొత్తూరు గ్రామానికి చెందిన ఒక మహిళ ఎంసిహెచ్ విభాగంలో ప్రసవం కోసం చేరింది. ఆమెకు సాధారణ ప్రసవమైంది. ఆమె బంధువు లావణ్య నుంచి అక్కడ పనిచేసే ఎఫ్ఎన్‌వో (జీడీఏ) రూ.500 లంచం తీసుకున్నారని వీడియో తీసి పెట్టారు. అంతేకాకుండా అడుగడుగునా అక్కడ సిబ్బంది లంచాలు అడిగిన విధానాన్ని ఆమె వీడియో ద్వారా తెలియజేశారు. ఈ సంఘటనపై విచారణకు కలెక్టర్ తక్షణం ఆదేశాలు జారీ చేశారు. తహసీల్దార్ శేషగిరి ఆసుపత్రికి చేరుకుని లావణ్య వాగ్మూలం నమోదు చేశారు. ఈ నెల 18న పూర్తిస్థాయి విచారణకు ముగ్గురు వైద్యుల బృందంతో కమిటీని ఏర్పాటు చేశారు. అక్కడ ఎవరు ఎంత లంచం తీసుకున్నారనేది విచారణ కమిటీ నిగ్గు తేల్చనుంది. ఈ సందర్భంగా ఏలూరు అర్బన్ తహసీల్దార్ శేషగిరి ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు తాను ప్రాథమిక విచారణ జరిపానని ఈనెల 18న పూర్తి స్థాయి విచారణ అనంతరం నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేయనున్నామని చెప్పారు.

ఆస్పత్రిలో భద్రతా చర్యలు తీసుకుంటాం

మెడికల్ సూపరింటెండెంట్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఏలూరు క్రైం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో భద్రతా చర్యలు తీసుకుంటామని ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎంఎస్ రాజు తెలిపారు. 'మోటారు సైకిళ్ల మాయం' శీర్షికన ఈనెల 12న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ స్పందించారు. విధి నిర్వహణలో అలసత్వంపై భద్రతా సిబ్బంది పర్యవేక్షకుని వివరణ తీసుకున్నట్లు శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో వివరించారు. ఇలాంటి సంఘటనలు జరుగకుండా చూడాలని సంబంధి త ఏజెన్సీ కాంట్రాక్టర్‌ను హెచ్చరించామని మెడికల్ సూపరింటెండెంట్ ఎంఎస్ రాజు తెలి పారు. సీసీ కెమెరాలు మరమ్మతు చేయించ డానికి, అవసరమైన చోట కొత్త వాటిని ఏర్పాటు చేయడానికి సంబంధిత అధికారులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించామన్నారు. ఇతరుల వాహనాలు ఆసుపత్రి ఆవరణలో రాకుండా నివారించడానికి అటెండెంట్ పాస్, వాహనాల పాస్ ఏర్పాటు చేయడానికి జిల్లా కలెక్టర్ అనుమతి కోరమని ఆసుపత్రి సహాయ నిర్వాహక అధికారి వారికి ఆదేశాలు జారీ చేసినట్లు డాక్టర్ ఎంఎస్ రాజు వివరించారు.

18 నుంచి వినియోగదారుల వారోత్సవాలు

ఏలూరు క్రైం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఈనెల 18 నుంచి 24 వరకూ వినియోగదారుల క్లబ్‌ల సమక్షంలో వినియోగదారుల వారోత్సవాలను నిర్వహించనున్నారు. ఏలూరు జిల్లా వినియోగదారుల అసోసియేషన్ కన్వీనర్, న్యాయవాది కట్టా సత్యనారాయణ తెలిపారు. ఆర్ఆర్‌పేటలో శుక్రవారం నిర్వహించిన వినియోగదారుల సంఘాల సమావేశంలో నాయకులు మాట్లాడారు. వినియోగదారుల్లో ఉద్యమం బలోపేతం చేయాలని ఆహార పదార్థాల కల్తీ, తూనికలు కొలతల మోసాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రతి గ్రామం, నగరాల్లోని వినియోగదారుల సంఘాలు ఏర్పాటు చేయాలన్నారు. వినియోగదారుల వారోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 18 నుంచి 24 వరకు స్కూలు విద్యార్థులకు వివిధ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వినియోగదారుల ఉద్యమనాయకులు, కో కన్వీనర్లు సుబ్రహ్మణ్యం, సీపీఎస్ రామానుజాచార్యులు, బంగార్రాజు, కస్తూరి, వి రామచంద్రమూర్తి, న్యాయవాదులు పి.పరమేశ్వరరావు, శ్రీనివాసరావు, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

చెయిన్ స్నాచర్లపై ప్రత్యేక నిఘా

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం పట్టణంలో కొంతకాలంగా చెయిన్ స్నాచింగ్ సంఘటనలు జరుగుతున్నాయి. అడ్డుకట్ట వేయడానికి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ యు.రవిచంద్ర తెలిపారు. డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఒంటరి మహిళలు లక్ష్యంగా చెయిన్ స్నాచర్లు రెచ్చిపోతున్నారన్నారు. మహిళలు బయటకు వచ్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నిర్మానుష్య ప్రాంతాల వైపు వెళ్లేటప్పుడు కుటుంబ సభ్యులను వెంట తీసుకువెళ్లాలని సూచించారు. అపరిచిత, అనుమానాస్పద వ్యక్తుల సమాచారం పోలీసులకు తెలియజేయాలన్నారు. చెయిన్ స్నాచర్లపై నిఘా పెట్టామని త్వరలోనే నిందితులను పట్టుకుంటామన్నారు.

హేకథాన్ విజేతలు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు


రూ.లక్ష నగదు ప్రోత్సాహకం అందుకున్న విద్యార్థులు

నూజివీడు టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ హేకథాన్‌లో ఆర్జీయుకేటీ నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. చత్తీస్‌గఢ్‌లోని భిలాయ్‌లో నిర్వహించిన స్మార్ట్ హేక్‌థాన్ వివరాలు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ అమరేంద్ర కుమార్ శుక్రవారం తెలిపారు. ట్రిపుల్ ఐటీ విద్యార్థుల జట్టు డైనమిక్ రూట్ రేషనలైజేషన్‌పై ప్రాజెక్టును సమర్పించి రూ.లక్ష బహుమతి గెలుచుకున్నారన్నారు. విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఏవో బి.లక్ష్మణరావు, డీన్ రత్నాకర్, శ్యామ్ పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీపై వర్క్‌షాపు

సైబర్ సెక్యూరిటీపై నూజివీడు ట్రిపుల్ ఐటీలో వర్క్‌షాపు నిర్వహించారు. సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ అడ్వాన్స్ కంప్యూటింగ్ - హైదరాబాద్ సంస్థ ఆధ్వర్యంలో ఈవర్క్‌షాపును నిర్వహించారు.

మాదిగల ఆర్థికాభివృద్ధికి రూ.340 కోట్లు : మంత్రి కొలుసు

నూజివీడు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మాదిగల ఆర్థికాభివృద్ధికి రూ.340 కోట్లు కేటాయించిన ఘనత టీడీపీ కూటమి ప్రభుత్వానిదేనని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు నియోజకవర్గ మాదిగల ఐక్య కార్యాచరణ సమితి ఆత్మీయ కలయిక సమావేశంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగతో కలిసి ఆయన పాల్గొన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాలు, దళితుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ద్వారా బాధ్యత తీసుకుంటానని చెప్పారు. మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా వస్తున్న రిజర్వేషన్లను ఎస్సీల్లోని 59 కులాలు అనుభవించాలనేదే ఎమ్మార్పీఎస్ వాదన అన్నారు. ఒకే వర్గం అనుభవించాలనేది మాలల వాదన అన్నారు. ఎస్సీలలో అన్యాయం జరిగిన వారికే ప్రాధాన్యతనివ్వాలనేదే తమ వాదన అన్నారు.

మ్యాజిక్ బోస్‌కు అమెరికా సంస్థ అవార్డు


బోస్‌ను అభినందిస్తున్న రఘురామకృష్ణరాజు

భీమవరం టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అమెరికా బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ ప్రఖ్యాత ఇంద్రజాలికుడు, రచయిత మేజిక్ స్టార్ బోస్‌ను 2024 సంవత్సరానికిగాను 'టాప్ టాలెంట్ ఆఫ్ ది ఇయర్'గా గుర్తించింది. 'ఐకాన్ అవార్డు'ను ఆయనకు ప్రదానం చేసింది. అమెరికా దేశపు 248వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆ సంస్థ బోస్‌కు అవార్డును ప్రకటించింది. మెజీషియన్‌గా, రచయితగా 53 ఏళ్లుగా బోస్ చేస్తున్న కృషి, అంకితభావం, పట్టుదల గుర్తించామని పేర్కొంది. అద్వితీయ ప్రతిభతో రికార్డులు నెలకొల్పుతున్న బోస్‌కు ప్రతిష్ఠాత్మక అవార్డును ఇవ్వడం తమకు గర్వకారణమని ఆ సంస్థ ప్రస్తుతించింది. అవార్డు పొందిన బోస్‌ను డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు అభినందించారు. బోస్ నిర్విరామ కృషి, సాధిస్తున్న విజయాలు స్ఫూర్తిదాయకమన్నారు. భవిష్యత్‌లో మరెన్నో ఉన్నత శిఖరాలకు బోస్ చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

ఏటిగట్టుపై చెత్త.. దారుణం

ప్రజలు ఎలా నివసిస్తున్నారు? కాలుష్య నియంత్రణ మండలి ప్రత్యేక బృందం దిగ్భ్రాంతి!


ఏటిగట్టుపై కంపోస్ట్ యార్డు

- కంపోస్ట్‌యార్డుపై నేషనల్ ట్రిబ్యునల్ విచారణ
- ప్రత్యేక బృందం ఏర్పాటు
- రెండు రోజులపాటు పరిశీలన
- నరసాపురంలో గాలి, నీటి నమూనాల సేకరణ


కాలుష్యం పరిశీలిస్తున్న ప్రత్యేక బృందం

నరసాపురం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఏటిగట్టు ప్రాంతంలోని కంపోస్టుయార్డును పరిశీలించిన ప్రత్యేక బృందం దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఏటిగట్టుపై కంపోస్ట్ యార్డు దారుణమని, కాలుష్యంతో వ్యాధి కారకమని, పరిసర ప్రాంతాల ప్రజలు ఎలా నివసిస్తున్నారని ఆశ్చర్యపోయింది. నరసాపురం స్మృతివనం వద్ద పురపాలక సంఘం నిర్వహిస్తున్న కంపోస్టుయార్డు ప్రాంతాన్ని చెన్నై కాలుష్య నియంత్రణ మండలి రీజనల్ డైరెక్టర్ హెచ్‌డీ వరలక్ష్మి నేతృత్వంలో ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఈఈ కేవీ. రావు, కోస్టల్ మేనేజ్‌మెంట్ అథారిటీ సభ్యుల ప్రత్యేక బృందం శుక్రవారం పరిశీలించింది. కంపోస్టుయార్డు, పరిసర ప్రాంతాల్లో పొలాలు, నివాసిత ప్రాంతాలు, చెరువులు, పంట కాల్వలను పరిశీలించి స్థానికులతో చర్చించారు. పలు చోట్ల నీటి నమూనాలు సేకరించారు. గాలిలో కాలుష్యాన్ని గుర్తించేందుకు పలు చోట్ల పరికరాలను అమర్చారు. రెండు రోజుల పాటు కాలుష్య శాతాన్ని గుర్తించేందుకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కంపోస్ట్ యార్డుతో కాలుష్య పరిస్థితులను పరిశీలించారు. కమిటీ రాకను తెలుసుకున్న స్థానికులు కొందరు ఆ ప్రాంతానికి తరలివచ్చారు. తమ సమస్యలను బృందానికి నివేదించారు. శనివారం కూడా ఈ బృందం పర్యటించనుంది.

మూడు దశాబ్దాల కంపు

పట్టణంలో 30ఏళ్లుగా కంపోస్టుయార్డును గోదావరి తీరాన్నే నిర్వహిస్తున్నారు. దీనివల్ల నదీ జలాలు కలుషితమై స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త ఓసూరి దేవేంద్ర ఫణికర్ ఢిల్లీలోని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు వేశారు. దీనిపై స్పందించిన ట్రిబ్యునల్ చెన్నైలోని కాలుష్య నియంత్రణ మండలి రీజనల్ డైరెక్టర్‌ను విచారించి నివేదికను అందించాలని ఆదేశించింది. కాలుష్య నియంత్రణ మండలి, కోస్టల్ మేనేజ్‌మెంట్ అథారిటీని కూడా ఈ కమిటీలో నియమించింది. జనవరి 7 నాటికి నివేదికను అందించాలని సంయుక్త కమిటీని ఆదేశించారు. ఈ నేపథ్యంలో కమిటీ నరసాపురం ప్రాంతాన్ని సందర్శించింది.

ఎలా భరిస్తున్నారు..

పరిశీలనకు వచ్చిన అధికారులు ఏటిగట్టు ప్రాంతంలో కంపోస్టు యార్డును పరిశీలించి ఆందోళన వ్యక్తం చేశారు. పరిసర ప్రాంత ప్రజలు ఎలా ఉంటున్నారని దిగ్భ్రాంతి చెందారు. చెత్త ప్రభావంతో తాము కొద్ది సమయంలోనే ఇబ్బంది పడ్డాం.. 30ఏళ్లుగా ఎలా భరిస్తున్నారంటూ ఆందోళన చెందారు. స్థానికులు ఇబ్బందులు తెలియజేయడంతో సమీపంలో ఉన్న పాఠశాల, కాలేజీని కూడా పరిశీలించారు. దగ్గరలోని పంట కాల్వ నీటిని సేకరించారు. పడవపై గోదావరిలోకి వెళ్లి నీటి నమూనా సేకరించారు. వివరాలు వెల్లడించేందుకు నిరాకరించారు. న్యాయస్థానంకు సంబంధించిన అంశం కావడంతో ఏమి చెప్పలేమని స్పష్టం చేశారు.

ప్రజల కోసమే పోరాటం



కంపోస్టుయార్డుతో ప్రజలు చాల ఇబ్బందులు పడుతున్నారు. అనేక సార్లు మునిసిపాల్టీ, ప్రభుత్వానికి నివేదించాం. అయినా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో ఢిల్లీలోని ట్రిబ్యునల్‌ను ఆశ్రయించి కేసు వేశా. కంపోస్టుయార్డు ఇక్కడి నుంచి తరలించే వరకు పోరాటం ఆపను. బాధ్యత గల పౌరుడిగా ప్రజల కోసం ఇదంతా చేస్తున్నా.

- ఓసూరి ఫణికర్

మృత్యువులోనూ కుమారుడి వెంట తల్లి

- అనారోగ్యంతో కుమారుడి మృతి
- అంత్యక్రియలు చేస్తుండగా తల్లి..
- గార్లమడుగులో విషాదం

పెదవేగి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో కుమారుడు మృతి చెందడంతో శ్మశానంలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. అంతలోనే వృద్ధాప్యంలో ఉన్న తల్లి మృతి చెందింది. కొద్ది గంటల వ్యవధిలో తల్లీ కుమారుల మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలాఉన్నాయి. గార్లమడుగు గ్రామానికి చెందిన చిలమకూరి వెంకట సత్యనారాయణ ఓరియంటల్ హైస్కూల్ హెచ్ఎంగా పనిచేశారు. నాలుగేళ్ల క్రితం విధులు ముగించుకుని ఏలూరు వెళుతుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు విరిగాయి. కోలుకున్న అనంతరం ఏలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల తీవ్ర అనారోగ్యంతో చిలమకూరి వెంకట సత్యనారాయణ(60) చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందారు. గార్లమడుగులో ఆయన భౌతికకాయానికి శుక్రవారం అంతిమ సంస్కారం ఏర్పాట్లు చేస్తూ శ్మశాన వాటికకు తరలించారు. అంతలోనే ఆయన తల్లి అనసూయమ్మ(80) మృతిచెందినట్లు సమాచారం అక్కడకు సమాచారం వచ్చింది. దీంతో గ్రామంలో విషాదం నెలకొంది. సత్యనారాయణ తండ్రి వెంకటరత్నం ఓరియంటల్ హైస్కూల్‌లోనే రికార్డు అసిస్టెంట్‌గా పనిచేశారు. ఆయన కుమారుడు సత్యనారాయణ అక్కడే చదువుకుని, అదే పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పనిచేశారు. అకస్మాత్తుగా మృతి చెందడం, ఒకరి వెంట ఒకరుగా తల్లి కుమారులు మృత్యుఒడికి చేరడం బాధాకరమని గ్రామస్తులు అన్నారు. భౌతిక కాయాల వద్ద నివాళులర్పించారు.

ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీ


తనిఖీ చేస్తున్న అధికారులు

ఏలూరు క్రైం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై విజిలెన్స్ అధికారులు శుక్రవారం విస్తృత తనిఖీ చేశారు. విజిలెన్స్ డీఎస్పీ సింగులూరి వెంకటేశ్వరరావు, విజిలెన్స్ డీఈఈ పి.శ్రీనివాసన్, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్స్ శివరామకృష్ణ, డి ప్రసాద్‌కుమార్, ఏజీ వి.శ్రీధర్, ఏఈ పి.శ్రీనివాసరావు, ఎఈఈ ఎం.రూపేష్‌వర్మ, ఎస్‌ఐ సీహెచ్ రంజిత్‌కుమార్, వ్యవసాయ, రెవెన్యూ అధికారులు బృందాలుగా తనిఖీలు చేపట్టారు. ఏలూరు నగరంలో తుంపాల ఎరువుల డిపోలో రూ.2.8 లక్షల విలువైన 12.25 మెట్రిక్ టన్నుల ఎరువులు భౌతిక నిల్వల్లో వ్యత్యాసాన్ని గుర్తించి స్టాక్‌ను సీజ్ చేశారు. తాడేపల్లిగూడెం పట్టణంలో నిర్వహిస్తున్న జోషిక ఎంటర్‌ప్రైజెస్‌లో రూ.36,93,525 విలువైన 128 మెట్రిక్ టన్నుల ఎరువులు భౌతిక నిల్వల్లో వ్యత్యాసం, రూ. 38,73,326 విలువైన 2,039 లీటర్ల బయో స్టీమ్‌లెన్‌ను గుర్తించి సీజ్ చేశారు. పెనుమంట్ర మండలం వెలగలేరులో గ్రంధి రామలింగేశ్వరరావు కంపెనీలో రూ.6,72,120 విలువైన 30.55 మెట్రిక్ టన్నుల ఎరువులు భౌతిక నిల్వల్లో వ్యత్యాసం ఉండడంతో స్టాక్‌ను సీజ్ చేశారు. ఈ మూడు షాపులపై ఫెర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్ 1985, సెక్షన్ 6(ఎ) నిత్యావసర వస్తువుల చట్టం 1955 ప్రకారం కేసులు నమోదు చేశారు.

క్రైమ్ కార్నర్

ద్విచక్ర వాహనం డిక్కీలో 120 గ్రాముల బంగారం చోరీ

భీమవరం క్రైం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం డిక్కీలో ఉంచిన బంగారాన్ని గుర్తు తెలియని దుండగులు దోచుకున్నారు. టూటౌన్ ఎస్‌ఐ రెహ్మాన్ తెలిపిన వివరాల ప్రకారం.. భీమవరం శ్రీరామపురానికి చెందిన వాడపల్లి అనూష తల్లితో కలసి చిన అమిరంలోని ఎస్‌బిఐ బ్యాంక్‌కు శుక్రవారం వెళ్లారు. బ్యాంకులో బంగారం తాకట్టు పెట్టడానికి వెళ్లి బ్యాంక్‌లో రూ.5లక్షలకు సరిపడా బంగారాన్ని పెట్టారు. మిగిలిన 120 గ్రాముల బంగారాన్ని బ్యాగులో ఉంచి ద్విచక్ర వాహనం డిక్కీలో పెట్టారు. పక్కనే జిరాక్స్ కాపీలు తీయించుకుని తిరిగి వచ్చి వాహన డిక్కీ తెరవగా అందులో బ్యాగ్ కనిపించలేదు. బ్యాగ్‌ను ఎవరో గుర్తు తెలియని దుండగులు అపహరించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రెహ్మాన్ తెలిపారు.

పరస్పర దాడులు

ఇరు వర్గాలపై కేసు

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నవారిగూడెంలో ఇరువర్గాల వారు పరస్పర దాడులకు దిగారు. ఇరువర్గాల వారు జంగారెడ్డిగూడెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇరుపక్షాలపై కేసులు నమోదు చేసినట్లు ఏఎస్సై మంగయ్య తెలిపారు. మండలంలోని చిన్నవారిగూడెంలో నైనారపు ఏడుకొండలుకు అదే గ్రామానికి చెందిన పత్తిపాటి వెంకటేశ్వరరావుకు పాత గొడవలున్నాయి. ఈ నెల 4న వెంకటేశ్వరరావు ఇంటికి ఏడుకొండలు వెళ్లి అతడి భార్యతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఆమె కేకలు వేయడంతో ఆమె భర్త వెంకటేశ్వరరావు వచ్చాడు. ఏడుకొండలు మళ్లీ వెళ్లి వెంకటేశ్వరరావును కొట్టి గాయపరచాడు. అడ్డొచ్చిన అత్తను కూడా కొట్టి గాయపరిచాడు. గాయపడిన వెంకటేశ్వరరావును 108 వాహనంలో జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. వారి తగాదా గ్రామ పెద్దలలో పరిష్కారం కాకపోవడంతో వెంకటేశ్వరరావు భార్య రమ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు. నైనారపు ఏడు కొండలును కొట్టి గాయ పరచిన కేసులో పత్తిపాటి బాలుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పత్తిపాటి బాలు వంటమేస్త్రిని కొడుతుండగా అడ్డు వెళ్ళిన తనను కింద పడవేసి బాలు కర్రతో కొట్టడంతో తలపై తీవ్ర గాయాలయ్యాయని, ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందినట్లు తెలిపారు. ఈ సంఘటనపై కూడా పెద్దలలో పరిష్కారం కాకపోవడంతో ఏడుకొండలు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై మంగయ్య తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్య

- చిత్తపూరు యువతి హైదరాబాద్‌లో మృతి
- భార్యాభర్తల గొడవలే కారణమా?

చాట్రాయి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా చాట్రాయి మండలం చిత్తపూరు గ్రామానికి చెందిన మొక్కపాటి నాగలక్ష్మి(29) హైదరాబాద్ మియాపూర్‌లో విషం తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. చిత్తపూరు గ్రామానికి చెందిన మొక్కపాటి శ్రీనివాసరావు కుమార్తె నాగలక్ష్మి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పనిచేస్తున్నారు. లింగపాలెం మండలం తువ్వచిలక గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ మొవ్వ మనోజ్ మణికంఠతో 5 నెలల క్రితం వివాహమైంది. మియాపూర్ గోపాలరావు నగర్ కాలనీలో నివాసం ఉంటున్న దంపతుల మధ్య కొన్ని రోజుల నుంచి గొడవలు జరుగుతున్నాయి. దీనితో మనస్తాపం చెందిన నాగలక్ష్మి గత నెల 26న ఆన్‌లైన్‌లో విష పదార్థం తెప్పించుకుంది. ఈ నెల 11న కూడా గొడవ జరగడంతో నాగలక్ష్మి ఎవరూ లేని సమయంలో విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన ఇంటి యజమాని, అతని కుటుంబ సభ్యులు కేపీహెచ్‌బీలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి ఆమె మృతి చెందింది. భర్త వేధింపులు తట్టుకోలేకే తమ కుమార్తె నాగలక్ష్మి ఆత్మహత్యకు పాల్పడిందని తల్లిదండ్రులు మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిత్తపూరులో విషాదఛాయలు

సామాన్య రైతు మొక్కపాటి శ్రీనివాసరావు పెద్ద కుమార్తె నాగలక్ష్మి హైదరాబాద్‌లో ఆత్మహత్యకు పాల్పడడంతో చిత్తపూరులో విషాఛాయలు అలుముకున్నాయి. శ్రీనివాసరావు ముగ్గురు కుమార్తెలను ఉన్నత చదువులు చదివించారు. రెండో కుమార్తెకు కూడా వివాహం కాగా మూడో కుమార్తె అమెరికాలో చదువుతోంది. అందరితో కలివిడిగా ఉండే శ్రీనివాసరావు కుటుంబంలో విషాదంతో బంధువులు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని గ్రామానికి తీసుకురానున్నారు.

పోక్సో కేసులో నిందితుడికి జీవిత ఖైదు

బాధితురాలికి రూ.3లక్షల పరిహారం ఇవ్వాలని కోర్టు ఆదేశం

ఏలూరు క్రైం/దెందులూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్ల బాలికపై 50 ఏళ్ళపైబడిన వ్యక్తి అత్యాచారానికి పాల్పడిన నేరం రుజువు కావడంతో యావజ్జీవ కారాగార శిక్ష, ఐదు వేల రూపాయల జరిమానా విధిస్తూ ఏలూరులోని పోక్సో కోర్టు జడ్జి ఉమాసునంద తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం దెందులూరు మండలంలోని ఒక గ్రామానికి చెందిన బాలిక తల్లి అనారోగ్యంతో మృతి చెందింది. తండ్రి చెడు వ్యసనాలకు బానిసై పిల్లలను చూడకపోవడంతో నాయనమ్మ వద్ద ఉంటున్నారు. దెందులూరుకు చెందిన నున్నా ఆంతోనీ రాజు (51) చిల్లర కొట్టువద్దకు 2022 అక్టోబర్ 8న బాలిక వెళ్లింది. ఒంటరిగా వచ్చిన బాలికను ఆంతోనిరాజు బలవంతంగా తన ఇంట్లోకి తీసుకువెళ్ళి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక ఎంత సేపటికి తిరిగి రాకపోవడంతో నాయనమ్మ వెళ్ళి చూసింది. అతడి ఇంట్లో బాలిక ఉండడాన్ని గమనించింది. బాలిక జరిగిన విషయం చెప్పడంతో దెందులూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్‌ఐ వీర్రాజు కేసు నమోదు చేశారు. అప్పటి మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ కె సత్యనారాయణ ఆంతోనిరాజును అరెస్టు చేశారు. ఈ కేసు ఏలూరులోని పోక్సో కోర్టులో విచారణ సాగింది. నిందితుడు నున్నా ఆంతోనిరాజుపై నేరం రుజువు కావడంతో అతడికి యావజ్జీ కఠిన గారాగార శిక్ష, ఐదు వేల రూపాయలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరు నెలలు అదనంగా శిక్ష అనుభవించాలన్నారు.

బాధితురాలికి మూడు లక్షల రూపాయలు పరిహారం ప్రభుత్వం ఇవ్వాలని ఉత్తర్వుల్లో న్యాయమూర్తి పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్‌కు అప్పటి ఎస్‌ఐ కె.స్వామి, ప్రస్తుతం ఎస్‌ఐ శివాజీ, కోర్టు కానిస్టేబుళ్ళు శ్రీకాంత్, దిలీప్, కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌స్పెక్టర్ ఎం సుబ్బారావు, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు, మహిళా హెడ్ కానిస్టేబుల్ ఎంవి రమణ, కానిస్టేబుల్ రవికుమార్, ఎఎస్‌ఐ సిసిలి, ఎఎస్‌ఐ రుక్మంధనరావు ప్రాసిక్యూషన్‌కు సహకరించారు. వీరందరిని ఎస్పీ కెపిఎస్ కిశోర్ అభినందించారు.

ప్రేమ పేరుతో బాలికపై వేధింపులు

పోక్సో చట్టం కేసు నమోదు

తణుకు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రైవేటు స్కూలులో తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికను ఒక వ్యక్తి ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. బాలిక తల్లి ఫిర్యాదుతో పోక్సో చట్టం కింద పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. తణుకు పట్టణానికి చెందిన తలపాకుల ప్రేమ్‌కుమార్ తరచు బాలిక వెంటపడి ప్రేమించాలని వేధిస్తున్నాడు. అతడి వేధింపులతో భయపడిన బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు.

17న ఏలూరులో జాబ్‌మేళా

ఏలూరు అర్బన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఎస్‌డీసీ ఆద్వర్యంలో ఏలూరు కలెక్టరేట్ సమీపంలోని ప్రభుత్వ డీఎల్‌టీసీ/ఐటీఐలో ఈ నెల 17న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు డీఎల్‌టీసీ అసిస్టెంట్ డైరెక్టర్ రవి తెలిపారు. వివిధ కంపెనీల్లో సుమారు 100 ఉద్యోగాలు భర్తీచేయనున్నారని తెలిపారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ విద్యార్హతలు కలిగి 18-35 ఏళ్ల వయసుగల నిరుద్యోగ యువత హాజరుకావచ్చునని సూచించారు. వివరాలకు ఫోన్‌నెంబర్లు 94934 82414, 89196 08183లలో సంప్రదించాలని కోరారు.

కోలుకున్న విద్యార్థులు


ఆసుపత్రి నుంచి డిశ్చార్జి

చాట్రాయి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటపాడు ఎంపీయుపీ స్కూల్‌లో మధ్యాహ్న భోజనం వికటించి అస్వస్థతతో, నూజివీడు ఏరియా ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్న 9 మంది విద్యార్థులు శుక్రవారం డిశార్చి అయ్యారు. డీఈవో ఎం.వెంకటలక్ష్మి శుక్రవారం నూజివీడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. విద్యార్థులు ఆసుపత్రి నుంచి నేరుగా స్కూల్‌కు రాగా పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ విజయలక్ష్మి, దుర్గాప్రసాద్ వారికి పరీక్షలు జరిపి ఆరోగ్యంగా ఉన్నారని చెప్పారు. అంతకు ముందు జిల్లా సర్వేలెన్స్ అధికారి నరేంద్రకృష్ణ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం వంట పాత్రలు, వాటర్ ట్యాంకు, ఆర్‌వో ప్లాంటును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో బ్రహ్మచారి, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దొంగనోట్ల ముఠా సభ్యుడి పరార్

పోలీసుల అదుపులో ఉండగానే తప్పించిన అనుచరులు?

భీమవరం క్రైం, డిసెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): దొంగనోట్ల ముఠాకు సంబంధించిన వ్యక్తిని పోలీసులు తీసుకువెళుతుండగా అతడి అనుచరులు అడ్డగించి తప్పించడం కలకలం రేపింది. నరసాపురం రూరల్ మండలానికి చెందిన వ్యక్తి డబ్బు నోట్లు ముద్రించి చెలామణీ చేసినట్లు సమాచారం రావడంతో శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన ఎస్‌ఐ, హెడ్‌కానిస్టేబుల్, ఇద్దరు కానిస్టేబుళ్లు నర్సాపురం రూరల్ ప్రాంతానికి చేరుకుని అతడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అనంతరం వాహనంలో శ్రీకాకుళం తరలిస్తుండగా రాజమహేంద్రవరం దాటిన తర్వాత నిందితుడి అనుచరులు కొందరు వ్యక్తులు వాహనాన్ని అడ్డగించి పోలీసులను గెంటివేసి తీసుకువెళ్ళిపోయినట్లు తెలిసింది. వారి ఆచూకీకోసం పోలీసులు టెక్నాలజీ ఆధారంగా పరిశీలించడంతో భీమవరం ప్రాంతంలో ఉన్నట్లు తెలియడంతో భీమవరంలో సోదా చేశారు. శ్రీకాకుళం పోలీసులు, భీమవరం పోలీసులు కలిసి ఈ సోదాలు నిర్వహించినట్లు తెలిసింది. నిందితుడి ఆచూకీ దొరకలేదని సమాచారం. దీనిపై స్థానిక పోలీసులను వివరణ కోరగా తమకు ఎటువంటి సమాచారం లేదని తెలిపారు.


విగ్రహం, బస్సు మధ్యలో ఇరుక్కున్న కారు

ఇరుక్కున్న కారు..

తాడేపల్లిగూడెం పట్టణంలోని పోలీస్ ఐలాండ్ వద్ద ఆర్టీసీ బస్సు, పక్కనే అంబేడ్కర్ విగ్రహం మధ్య కారు ఇరుక్కుపోయింది. సుమారు 15 నిముషాలు ట్రాఫిక్ నిలిచిపోయింది. పెంటపాడు వైపు నుంచి పోలీస్ ఐలాండ్ వద్దకు కారు వస్తుండగా గమనించని ఆర్టీసీ డ్రైవర్ మలుపు కొట్టడంతో కారు మధ్యలో ఇరుక్కుంది. స్థానికులు కేకలు వేయడంతో బస్సు నిలిపారు. బస్సుకు, అంబేద్కర్ విగ్రహానికి మధ్య కారు ఇరుక్కోవడంతో కొంత సేపు ట్రాఫిక్ జాం అయింది.

- తాడేపల్లిగూడెం రూరల్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

పోలవరంలో ఏర్పాట్ల పరిశీలన

పోలవరం డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పోలవరం ప్రాజెక్టును సీఎం చంద్రబాబు నాయుడు ఈ నెల 16న సందర్శించనున్న నేపథ్యంలో శుక్రవారం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ప్రాజెక్టులో ఏర్పాట్లను పరిశీలించారు. హెలీప్యాడ్, ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలు, డయాఫ్రంవాల్ ప్రాంతాలను పరిశీలించారు. కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి తదితరులు పాల్గొన్నారు.

ఏఆర్ డీఎస్పీగా చంద్రశేఖర్

ఏలూరు క్రైం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఆర్మ్‌డు రిజర్వు విభాగం డీఎస్పీగా బి చంద్రశేఖర్ శుక్రవారం ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో బాధ్యతలను చేపట్టారు. చంద్రశేఖర్ 1991లో ఆర్ఎస్ఐగా పోలీస్ శాఖలో చేరి ఏలూరు రేంజ్‌లో పని చేశారు. 2012లో డీఎస్పీగా పదోన్నతి పొంది వివిధ ప్రాంతాల్లో పనిచేశారు. ప్రస్తుతం కాకినాడ ఏఆర్ డీఎస్పీగా పని చేస్తున్న ఆయనను ఏలూరు జిల్లా ఎఆర్ డీఎస్పీగా ప్రభుత్వం నియమించడంతో శుక్రవారం ఉద్యోగ బాధ్యతలను చేపట్టారు. అనంతరం ఆయన జిల్లా ఎస్పీ కిషోర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

నేడు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

ఏలూరు కార్పొరేషన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక అగ్రహారంలోని గీతా మందిరంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు లయన్స్ క్లబ్ నాయకుడు మానేపల్లి రామారావు తెలిపారు. అన్ని వ్యాధులకు ఆయుష్ ఆయుర్వేద వైద్యాధికారి బి.వి.ఎం.నగేష్ వైద్య పరీక్షలు జరిపి ఉచితంగా అందజేస్తారని తెలిపారు.

క్రిస్మస్ ఆరాధన పండుగలు

ఏలూరు టూ టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మన్నాచర్చి ఆధ్వర్యంలో ఈ నెల 16, 17 తేదీల్లో క్రిస్మస్ ఆరాధన పండుగలు నిర్వహిస్తున్నట్లు చర్చి పాస్టర్ ఎం.జ్యోతిరాజు తెలిపారు. మన్నాచర్చ్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సెంట్ జేవియర్ హైస్కూల్ గ్రౌండ్స్‌లో సాయంత్రం 6 గంటలకు జరిగే ఈ పండుగల్లో అంతర్జాతీయ సువార్తీకులు, టీవీ వర్తమానికులు డాక్టర్ జాన్ వెస్లీ ప్రసంగిస్తారన్నారు. 15వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి మన్నాచర్చ్ నుంచి నగర వీధుల్లో క్రిస్మస్ సువార్త ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు.

53 మందికి ఉద్యోగాలు

ఏలూరు అర్బన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎన్ఏసీ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించిన జాబ్‌మేళాకు మొత్తం 97 మంది నిరుద్యోగ యువత హాజరుకాగా, వీరిలో 53 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్టు ఏపీఎస్ఎస్‌డీసీ అధికారి జితేంద్రబాబు తెలిపారు. ఎన్ఏసీ ఇన్‌చార్జి పెద్దిరాజు, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి ప్రవీణ్, కో-ఆర్డినేటర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ థెరిస్సాలో సెమీ క్రిస్మస్

ఏలూరు అర్బన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సెయింట్ థెరిస్సా బాలికల జూనియర్ కళాశాల ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. క్రీస్తు జననంపై ఫాదర్ బాలరాజు విద్యార్థినులకు వివరించారు. సెయింట్ థెరిస్సా విద్యాసంస్థల సుపీరియర్ మదర్ ఎర్నస్టైన్, ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ ఫాతిమా డిగల్, సుపీరియర్ సిస్టర్ లూర్దుమేరీ పాల్గొన్నారు. విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

సమస్యలు పరిష్కరించుకోండి

ఏలూరు రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఏలూరు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి సంఘాల సమావేశం జరిగింది. ఎంపీపీ పి. శ్రీనివాసరాజు మాట్లాడుతూ సమస్యలు చర్చించేందుకు స్థాయి సంఘ సమావేశాలు వినియోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా రోడ్లు, భవనాలు, డ్రైన్‌లు, వ్యవసాయం, తాగునీరు, విద్య, ఆరోగ్యం తదితర సమస్యల పై చర్చించారు. ఎంపీడీవో వెన్నా శ్రీలత, పలువురు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సావనీర్ ఆవిష్కరణ

ఏలూరు కార్పొరేషన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో మహాసభల సావనీర్ ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ బాషా మాట్లాడుతూ ఈ ఏడాది జూన్‌లో ఏలూరులో జరిగిన సభల్లో వక్తలు మాట్లాడిన విలువైన విషయాలను సమగ్రంగా సావనీర్ రూపంలో ప్రచురించామన్నారు. ఈ సావనీర్‌ను ప్రతీ ఒక్కరూ చదువుకోవాలని పిలుపునిచ్చారు. రైతు కూలీ సంఘం ఏపీ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఝాన్సీ, ప్రముఖ న్యాయవాది పి.పి.శాస్త్రి, స్వచ్ఛంద సంస్థల నాయకులు ఆలపాటి నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

వృద్ధురాలి మృతి

ద్వారకాతిరుమల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఏలూరుకు చెందిన బండి వెంకటరమణ (70) మూడు నెలలుగా ద్వారకాతిరుమలలోనే ఉంటోంది. ఈమెకు ముగ్గురు కుమారులు కాగా వారు ముగ్గురూ మృతిచెందడంతో ఆమె ద్వారకాతిరుమలలో భిక్షాటనతో జీవిస్తోంది. ప్రతినెలా పెన్షన్ తెచ్చుకునేందుకు ఏలూరు వెళ్లి మరలా వచ్చేస్తుంది. ఎప్పటిలా రాత్రి భోజనం చేసి పడుకున్న ఆమె ఉదయం లేవలేదు. దీంతో స్థానికులు వైద్యులతో పరీక్షించగా ఆమె మృతి చెందినట్లు చెప్పారు.

ఫంక్షన్లు చేసేదెలా..?

» సామాజిక భవనాల్లో సచివాలయాలు » ఎస్సీ, బీసీ వర్గాల వెతలు



జగన్నకాలని నగర్లో ఎస్సీ సామాజిక భవనంలో సచివాలయం

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పేదలైన ఎస్సీ, బీసీ సామాజిక వర్గాల ప్రజలు సామూహికంగా సమావేశాలు నిర్వహించుకోవడానికి, ఏదైనా చిన్న చిన్న శుభకార్యాలు చేసుకోవడానికి ఉపయోగించే ఎస్సీ, బీసీ కమ్యూనిటీ భవనాలను గత వైసీపీ ప్రభుత్వం సచివాలయాలుగా మార్చింది. దీంతో ఆయా వర్గాలకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సచివాలయాలు పెట్టకముందు కమ్యూనిటీ భవనంలో మహిళలు డ్వాక్రా సమావేశాలు నిర్వహించుకునేవారు. ఇప్పుడు ఇరుకు ఇళ్ళలోనే సమావేశాలు నిర్వహిస్తున్నారు. వివాహ కార్యక్రమాలు ఏదైనా ఫంక్షన్ హాలులో నిర్వహించుకోవాలంటే లక్షలాది రూపాయలు ఖర్చవుతుంది. కనుక పేదలు రోడ్లపైనే శుభకార్యాలు జరుపుకునే పరిస్థితి ప్రస్తుతం నెలకొంది. జంగారెడ్డిగూడెం పట్టణంలో పది సచివాలయాలుండగా వీటిలో ఎస్సీ కమ్యూనిటీ భవనాలలో రెండు, బీసీ కమ్యూనిటీ భవనాలలో నాలుగు నడుస్తున్నాయి. రెండు సచివాలయాలు ప్రైవేటు భవనాలలోను, రెండు మున్సిపాలిటీకి చెందిన భవనాలలోను నడుస్తున్నాయి. అలాగే మండలంలోని తాడువాయి గ్రామంలోని రెండో సచివాలయం ఎస్సీ సామాజిక భవనంలో నడుస్తుంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తమ సామాజిక భవనాలను తమకు అప్పగించాలని కోరుతున్నారు.



రోడ్లపై ఫంక్షన్ల నిర్వహణతో గొడవలు

గత ఐదేళ్ళుగా మా సామాజిక వర్గంలో ఏదైనా శుభకార్యం జరపాల్సి వస్తే రోడ్డుపై జరుపుతున్నాము. దీంతో ఇతరులు మాపై గొడవలకు దిగుతున్నారు. మా సామాజిక అవసరాలకు కట్టిన భవనంలో సచివాయం పెట్టడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. మా సామాజిక భవనం మాకు అప్పగించాలి.

-నిట్టా రామ్‌కుమార్, ఎస్సీ పేట, అంబేద్కర్ నగర్, జంగారెడ్డిగూడెం



అద్దె భవనాల్లోకి మారుస్తాం

పట్టణంలో 2 ఎస్సీ కమ్యూనిటీ భవనాల్లో నడుస్తున్న సచివాలయా లను తొలగించాలని వినతులొచ్చాయి. వాటిని అద్దె భవనాల్లోకి మారుస్తాం. ప్రభుత్వ ఆదేశాలు వస్తే కొత్త భవనాల ను నిర్మిస్తాం.

-కేవీ రమణ, మున్సిపల్ కమిషనర్, జంగారెడ్డిగూడెం

నేడు నీటి సంఘాల ఎన్నికలు

లింగపాలెం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): శనివారం జరగనున్న నీటి సంఘాల ఎన్నికలకు అధికారులు సిద్ధంగా ఉండాలని తహసీల్దార్ నజీ ముల్లాషా అన్నారు. మండలంలో 20 చెరువులకు నీటి సంఘాల ఎన్నికలు ఆయా గ్రామాలలో జరుగుతాయని, అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. డీటీ నాగబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పెదపాడు: మండల పరిధిలోని రెండు నీటి వినియోగదారుల సంఘం ఎన్నికలు శనివారం ఉదయం 8 గంటల నుంచి ఎన్నిక నిర్వహించనున్నట్లు తహసీల్దారు కృష్ణజ్యోతి తెలిపారు. ఈ ఎన్నికలు ఆయా గ్రామాల పరిధి లోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతాయ న్నారు. ఎన్నికల కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు.

టి.నరసాపురం: నేడు సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ టి.ఎస్ సాయబాబా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు భూమి పన్ను చెల్లించిన రశీదు కలిగి ఉండాలని, ఓటుహక్కు కలిగిన రైతులు పట్టాదార్ పాస్‌పుస్తకం లేదా 1బితో పాటు ఆధార్ కార్డు తీసుకుని ఎన్నికల కేంద్రానికి ఉదయం 8 గంటలకు రావాలని తెలిపారు.

ఏలూరు రూరల్: ఏలూరు రూరల్ మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలు శనివారం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. జాలిపూడిలోని 3 వేల ఎకరాల ఆయకట్టుకు సంబంధించి నేడు ఎన్నికలు జరుగుతాయన్నారు.

జనసేనలో భారీగా చేరికలు



జనసేనలో చేరిన సంకు రాంబాబు తదితరులు

నిడమర్రు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల కోసం కృషి చేస్తున్న పవన్ కల్యాణ్ నాయకత్వంపై ప్రజలకు విశ్వాసం పెరుగుతోందని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నా రు. శుక్రవారం భువ్వనపల్లిలో వైసీపీ నాయకులు సంకు రాంబాబు, తన్నీడి విజయ్‌కుమార్, అలుమోలు శ్రీనివాస్, తన్నీడి రవికుమార్, వార్డు మెంబర్లు సంకు శ్రీనివాసరావు మరియు 80 మంది కార్యకర్తలు జనసేన తీర్థం పుచ్చుకొన్నారు. సిద్ధాపురంలో జరిగిన కార్యక్రమం లో వైసీపీ నాయకులు నౌడు అప్పారావు, నౌడు పెద అచ్చారావు, గుల్లిపల్లి రమేష్, దుంగల అనిల్ కుమార్, అల్లు విష్ణు, గుల్లిపల్లి శ్రీమన్నారాయణ తదితరులతో పాటు 70 మంది కార్యకర్తలు జనసేనలో చేరగా వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

కానిస్టేబుల్ దంపతులకు గాయాలు

తక్షణ వైద్యసేవలందేలా డీఎస్పీ చర్యలు

ఏలూరు క్రైం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు డీఎస్పీ కార్యాలయంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ప్రదీప్ కిరణ్ అతని సతీమణి ఏలూరు రూరల్ మండలంలోని ఒక గ్రామంలో జరిగిన కార్యక్రమానికి వెళ్ళి తిరిగి మోటారు సైకిల్‌పై శుక్రవారం సాయంత్రం వస్తుండగా శ్రీపర్రు సమీపంలో ప్రమాదవశాత్తు పడి తీవ్ర గాయాలకు గురయ్యారు. సమాచారం అందుకున్న ఎస్పీ కిషోర్ దగ్గరుండి వైద్య సేవలందేలా చూడాలని ఏలూరు డీఎస్పీకి ఆదేశాలు జారీ చేయడంతో డీఎస్పీ శ్రావణ్‌కుమార్, ఏలూరు రూరల్ ఎస్ఐ దుర్గా ప్రసాద్ ఏలూరు ప్రభుత్వాసుపత్రికి వచ్చి వారికి ప్రాథమిక వైద్య సేవలు, ఎంఆర్ఐ స్కాన్‌లు తీయించారు. అనంతరం మెరుగైన చికిత్సకు ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. దీంతో ఎస్పీ, డీఎస్పీలకు కానిస్టేబుల్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



ఎమ్మెల్యేకు సమస్యలు వివరిస్తున్న స్థానికులు

మహిళల భద్రతకు పెద్దపీట : ఎమ్మెల్యే బడేటి

ఏలూరు టూ టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): యువతకు ఉపాధి, మహిళలకు భద్రత కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో గురువారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. చోడే వెంకటరత్నం, రెడ్డి నాగరాజు పాల్గొన్నారు.

సౌర శక్తిపైనే భవిష్యత్ ఆధారం : చింతమనేని

పెదవేగి, డిసెంబరు 13 : సౌరశక్తిపైనే భవిష్యత్ ఆధారపడుతుందని, ప్రతి ఒక్కరూ సౌరశక్తి వినియోగానికి మళ్ళాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజనపై పెదవేగి మండలం దుగ్గిరాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సౌరశక్తి వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ అంతరించిపోతున్న సహజ ఇంధన వనరులను పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సహజ వనరులకు ప్రత్యామ్నాయంగా కాలుష్య రహిత సౌరశక్తి విని యోగం ఎంతోమేలని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించి, సౌరశక్తిని వినియోగించాలని ఆయన సూచించారు. దీనికోసం కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకాన్ని తీసుకొచ్చిందని, ఈ పథకంలో రాయితీపై సౌరశక్తి పరికరాలను అందిస్తోందని, ప్రజలు ఈ



అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. దెందులూరు నియోజకవర్గంలో పెదవేగి మండలం దుగ్గిరాలను సూర్య ఘర్ పథకం అమలుకు మోడల్‌గా ఎంపిక చేశామని, గ్రామంలో నూరుశాతం సౌరశక్తి వినియోగ గ్రామంగా దుగ్గిరాలను తీర్చిదిద్దుతామన్నారు. విద్యుత్‌శాఖ ఎస్ఈ సాల్మన్‌రాజు, డీఈ కేఎం అంబేడ్కర్, పెదవేగి ఏడీఈ కృష్ణరాజు, ఇన్‌చార్జ్ ఏఈ రాంబాబు, ఎంపీడీవో పి.శ్రీనివాస్, తహసీల్దారు ఎస్.భ్రమరాంబ, సర్పంచ్ గుంజా ఏసుమణి, టీడీపీ నాయకులు బొప్పన సుధాకర్, బ్యాంకు అధికారి హనుమంతరాజు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ధర్నా



డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న వైసీపీ నాయకులు

ఏలూరు రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని, అన్నదా తలను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా శుక్రవారం కలెక్టరేట్ వద్ద వైసీపీ నాయకులు ధర్నా నిర్వహిం చారు. ఆ పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మామిళ్ళపల్లి జయప్రకాష్, కారుమూరి సునీల్, మాజీ ఎమ్మెల్యేలు మేకా ప్రతాప్‌అప్పారావు, బాలరాజు, వాసుబాబు, కార్యకర్తలు ఫైర్‌స్టేషన్ నుంచి ర్యాలీగా బయల్దేరి కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం డీఆర్వోను కలిసి వినతిపత్రం అందచేశారు. కె.విజయ్‌రాజు, మాజీ డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, సుధీర్‌బాబు, కార్పొరేటర్ ఎస్.చంద్రశేఖర్, జి.విజయనిర్మల, ఇనుపనూరి కేదారేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన పాలనకే శిక్షణ : జేడీ రమణ

పెదవేగి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : శిక్షణా కాలంలో నేర్చుకున్న అంశాలను పాలనలో ఉపయోగించుకుని గ్రామాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్ళాలని ఏపీ గ్రామీణ అభివృద్ధి సంస్థ జేడీ రమణ అన్నారు. సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బందికి పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు రెండో రోజు శుక్రవారం జరిగాయి. జేడీ మాట్లా డుతూ స్థానికంగా లభ్యమయ్యే వనరుల ను వినియోగించుకుంటూ పంచాయతీలను అభివృద్ధి దిశగా నడిపించాలన్నారు. ఎంపీడీవో పి.శ్రీనివాస్, ఏపీఎం ఏసురత్నం, అంగన్‌వాడీ పెదవేగి సెక్టార్ సూపర్‌వైజర్ పార్వతి, పెదవేగి పీహెచ్‌సీ సీహెచ్‌వో డి.రోజీమేరీ, పది గ్రామాల సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏలూరు రూరల్: గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఏలూరు ఎంపీడీవో వెన్నా శ్రీలత అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెండురోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి సాధించేందుకు ప్రణాళికను ఇచ్చినట్లు తెలిపారు. సమన్వయంతో ఈ లక్ష్యాలను సాధించాలని తెలిపారు. పంచాయతీరాజ్ ఏఈ మురళీకృష్ణ, మెప్మా ఏపీఎం నాగేశ్వరరావు, ఉపాధి ఏపీవో బషర్‌తుల్లా పాల్గొన్నారు.

పోలవరం: పోలవరం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీల అభివృద్ధిపై పంచాయతీరాజ్ అధికారుల ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో ఇ. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కోర్టుల్లో లక్షలాది కేసుల పెండింగ్

ఏలూరు టూ టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో హైకోర్టు, జిల్లా కోర్టుల్లో 8,99,895 సివిల్, క్రిమినల్ కేసులు పెండింగులో ఉన్నట్లు కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్ లోక్‌సభలో వెల్లడించారు. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఏలూరు జిల్లాలో 65,800 సివిల్, క్రిమినల్ కేసులు పెండింగులో ఉన్నాయని మంత్రి బదులిచ్చారు. 1993 నుంచి ఇప్పటి వరకు ఏపీలో కోర్టులు, రెసిడెన్షియల్ యూనిట్లు, న్యాయవాదుల బిల్డింగులు, టాయిలెట్‌ల నిర్మాణాల కోసం రూ. 272 కోట్లు విడుదల చేసినట్లు మంత్రి తెలిపారు. న్యాయస్థానాల్లో మౌలిక సదుపాయా ల కల్పనకు రూ. 11,571కోట్లు విడుదల చేశామన్నారు. సుప్రీం కోర్టులో 64 మంది న్యాయమూర్తులు, హైకోర్టులో 999 మంది కొత్త న్యాయమూర్తులను నియమించామన్నారు. దేశ వ్యాప్తంగా ఈ ఏడాది సెప్టెంబరు నాటికి 2లక్షల 81వేల కేసులు పరిష్కరించామన్నారు.



పార్లమెంట్‌లో మాట్లాడుతున్న ఎంపీ మహేష్ కుమార్

హైందవ శంఖారావానికి రావాలని ఎమ్మెల్యేలకు ఆహ్వానం

ఉంగుటూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జనవరి 5న గన్నవరంలో జరిగే హైందవ శంఖారావంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి పిలుపు నిచ్చారు. శుక్రవారం ఉంగుటూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సత్యనారాయణ చౌదరి ఆధ్వర్యంలో ఆహ్వానం అందించారు. అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ కన్వీనర్ శరణాల మాలతీరాణి, అడపా శోభారాణి, వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి తనికెళ్ళ సత్య రవి కుమార్, కస్తూరి సూర్య ప్రకాష్, జిల్లా కన్వీనర్ పాములు తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు టూ టౌన్: జనవరి 5న గన్నవరంలో హైందవ శంఖారావం భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్న ట్లు వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి టీ.సత్యరవికుమార్ తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య హైందవ శంఖారావం పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు.

పెదవేగి: హైందవ శంఖారావం సభకు రావాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను కోరారు. పెదవేగి మండలం దుగ్గిరాల కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసిన విశ్వహిందూ పరిషత్ నాయకులు వచ్చేనెల 5వ తేదీన గన్నవరంలో జరిగే హైందవ శంఖారావం సభకు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.



నూతన రాజ్యసభ సభ్యులకు కరాటం అభినందన

కొయ్యలగూడెం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కొత్తగా ఎంపికైన రాజ్యసభ సభ్యులను డీసీసీబీ మాజీ చైర్మన్, జనసేన నేత కరాటం రాంబాబు కలిశారు. శుక్రవారం అమరావతి వెళ్లి కొత్తగా నియమితులైన బీదరమస్తాన్, సానా సతీష్, ఆర్.కృష్ణయ్యలను కలిసి అభినందించి ఏజెన్సీ ప్రాంతాభివృద్ధికి కృషి చేయాలని కోరినట్లు తెలిపారు. ఈయన వెంట జనసేన నాయకులు కసుకుర్తి ఉమా, కరుణ, తదితరులు పాల్గొన్నారు.

గౌరవ వేతనం విడుదల చేయాలి

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మసీదుల్లో పనిచేసే ఇమామ్, మౌజన్ (గురువు)లకు ఏడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలని మండలంలోని లక్కవరం ఫారూఖి మసీదు కమిటీ అధ్యక్షుడు పఠాన్ అన్వర్‌బాషా ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం లక్కవరం ఫారూఖి మసీదులో జరిగిన కమిటీ సమావేశం జరిగింది. లక్కవరం లో ఈద్గా,షాదీఖానా నిర్మించాలని, రంజాన్ తోఫా ఇవ్వాలని కోరారు.

ఎంబీఏ విద్యార్థులకు ఐటీ రంగంలో అవకాశాలు

ఏలూరు అర్బన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : 'ఎంబీఏ విద్యార్థులకు ఐటీ రంగంలో కెరియర్ ప్లానింగ్, అవకాశాలు' అనే అంశంపై శుక్రవారం స్థానిక సీఆర్ఆర్ పీజీ కళాశాలలో అతిథి ఉపన్యాస కార్యక్రమం జరిగింది. స్విట్జర్లాండ్ కేంద్రంగా వాణిజ్య కార్యకలాపాలు సాగిస్తోన్న ఈ-కామ్ ట్రేడింగ్ కంపెనీ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ సీహెచ్.మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతి యేటా భారత్‌లో ఆరులక్షల మంది విద్యార్థులు ఎంబీఏ పూర్తి చేసుకుంటున్నారని, వీరికి ప్రస్తుతం ఐటి రంగంలో బిజినెస్ ఎనలెటిక్స్, ఈఆర్పి సాఫ్ట్‌వేర్ టెస్టింగ్, డిజిటల్ మార్కెటింగ్, సైబర్ సెక్యూరిటీ, డేటాసైన్స్, బిజినెస్ ఎనలిస్టు, డెవాప్స్, డేటాబేస్ అడ్మినిస్ట్రేటర్ తదితర రంగాల్లో అపారమైన ఉద్యోగావకాశాలున్నాయన్నారు. దేశంలో రానున్న ఐదేళ్లలో 1.10 కోట్లమందికి ఉపాధి అవకాశాలుంటాయని పేర్కొన్నారు. మురళీకృష్ణ దంపతులను కళాశాల యాజమాన్యం సత్కరించింది. కరస్పాండెంట్ కె.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రామరాజు, వైస్ ప్రిన్సిపాల్ విశ్వేశ్వరరావు, పీజీ కోర్సుల డైరెక్టర్ యలమర్తి బాబు, ఆర్.శ్రీనివాసరావు, టి.రాజేష్, రవీంద్రబాబు, ఉపేంద్ర, అపర్ణ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ

పెదపాడు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఊరికి దూరంగా ఉన్న వలస కార్మికుల పట్ల వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఏలూరు జిల్లా మలేరియా అధికారి పీఎస్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం కొత్తముప్పర్రులోని ఇటుక బట్టీల వద్ద పనిచేసే కార్మికులకు మలేరియాపై వ్యాధి పట్ల అవగాహన కల్పించారు. అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడిని అధిగమించాలి

లింగపాలెం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మానసిక స్థైర్యంతో ఒత్తిడిని తొలగించుకోవాలని డాక్టర్ కోమలి అన్నారు. ధర్మాజీగూడెంలోగల ప్రతిభ జూనియర్ కళాశాలలో డిస్ట్రిక్ మెంటల్ హెల్త్ ప్రోగ్రాంలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. శ్రీసాయి జూనియర్ కళాశాల, ప్రతిభ జూనియర్ కళాశాలల డైరెక్టర్ కె. సుజాతకుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

16 నుంచి ధనుర్మాసోత్సవాలు

ఏలూరు కార్పొరేషన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : దేవాదాయ శాఖ ఆధ్వర్యంలోని అగ్రహారంలో గల శ్రీ జనార్ధనస్వామి ఆలయం వద్ద ఈనెల 16వ తేదీ నుంచి ధనుర్మాసోత్సవాలను ప్రారంభిస్తున్నట్టు ఆలయ కార్య నిర్వహణాధికారి చిట్టేడి వెంకట నాగ మునేశ్వరరావు, ప్రధాన అర్చకులు వంగల పవనకుమారాచార్యులు తెలిపారు. ఈ ధనుర్మాసంలో ప్రతిరోజూ ఉదయం 7 గంటలకు పాశురాల పారాయణ, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. జనవరి 10 నుంచి 19వ తేదీ వరకు అలంకారోత్సవాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ముక్కోటి ఏకాదశి రోజున ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమద్వ్రతాలు

పోలవరం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : హనుమద్వ్రతాలు శుక్రవారం పోలవరం మండలంలో ఘనంగా నిర్వహించారు. పోలవరం సువర్చలా సమేత ఆంజనేయస్వామి ఆలయం, గూటాల అభయాంజనేయస్వామి ఆలయాలలో ఉత్సవాల సందర్భంగా విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.

ఏలూరు కార్పొరేషన్: అంబికాదేవి ఆలయ ప్రాంగణంలోని వీరాంజనేయస్వామి, మినీ బైపాస్ రోడ్డులోని భక్తాంజనేయస్వామి, పత్తేబాదలోని అభయాంజనేయస్వామి, డీమార్ట్ సెంటర్, పవరుపేట, దక్షిణపువీధి తదితర ప్రాంతాల్లో గల హనుమాన్ ఆలయాల్లో హనుమద్వ్రతాలను నిర్వహించారు.

జీలుగుమిల్లి: అభయాంజనేయస్వామి ఆలయంలో స్వామివారిని కలువ పూలతో పూజించారు. దీక్ష చేపట్టిన స్వాములు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. శనివారం మండల దీక్ష పూర్తి చేసుకున్న స్వాములు ఇరుముడి, అన్న సమారాధనలు జరుపుతున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.

భూ సమస్యల పరిష్కారానికే..

రెవెన్యూ సదస్సులు : ఆర్డీవో



రైతు నుంచి ఫిర్యాదును స్వీకరిస్తున్న ఆర్డీవో అచ్యుత్ అంబరీష్

పెదవేగి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని ఏలూరు ఆర్డీవో అచ్యుత్ అంబరీష్ అన్నారు. వేగివాడలో శుక్రవారం జరిగిన రెవెన్యూ గ్రామసభలో ఆయన పాల్గొని, రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. గ్రామసభల్లో అందిన అర్జీలను వెంటనే పరిశీలించి, తక్షణం పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టామని, ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని సూచించారు. సర్పంచ్ పి. ప్రభావతి సూర్యచంద్రరావు, తహసీల్దారు భ్రమరాంబ, సర్వేయర్ సత్యనారాయణమూర్తి, ఆర్ఐ కేవీ సారధి, వీఆర్వో ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

ప్రతి సమస్య పరిష్కారం: ఎమ్మెల్యే చిర్రి

పోలవరం: మండలంలో ప్రతి భూసమస్య రెవెన్యూ సదస్సులో పరిష్కరిస్తామని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలిపారు. శుక్రవారం పట్టిసీమలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి అధికారుల బృందం ప్రతి గ్రామానికి వస్తుందన్నారు. అనంతరం గూటాల భక్తాంజనేయస్వామి ఉత్సవాల్లో పూజలు నిర్వహించారు. తహసీల్దారు సాయిరాజు, ఆర్డీవో రమణ, సర్పంచ్ శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

పెదపాడు: అన్ని గ్రామాల్లో రెవెన్యూ గ్రామ సభలను నిర్వహించి రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జిల్లా పంచాయతీ అధికారి, మండల నోడల్ ఆఫీసరు అనూరాధ తెలిపారు. వట్లూరులో శుక్ర వారం రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కరించుకోవాలని సూచించారు. అర్జీలను స్వీకరించి వాటి పరిష్కారానికి ఆదేశించారు. డీటీ కె.సునీత, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చింతలపూడి: చింతంపల్లి పంచాయతీ గుర్నేపల్లిలో రెవెన్యూ సదస్సు జరిగింది. తహసీల్దార్ ప్రమద్వర మాట్లాడుతూ వెబ్‌ల్యాండ్ అడంగళ్‌లో నోషనల్ ఖాతాలుగా ఉన్న విస్తీర్ణం రెట్టింపు ఉన్న వాటిని, జిరాయితీ భూములు 22ఎ రిజిస్టర్‌లో కలిగి ఉండడం, అసైన్‌మెంట్ భూములు, ఎల్‌డి పట్టాలు పొందిన భూములు వాటి యజమానులు మరణించినా వారసత్వంగా వారసులు దరఖాస్తులను ఈ రెవెన్యూ సదస్సులో ఇవ్వాలని సూచించారు. తమ గ్రామంలో చెరువులు ఆక్రమణల వల్ల ఇబ్బందులు పడుతున్నామని, పుంతదారులు ఆక్రమణలకు గురయ్యాయని సదస్సు దృష్టికి తెచ్చారు. చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. సర్పంచ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కామవరపుకోట: తహసీల్దార్ గెడ్డం ఎలీషా శుక్రవారం కామవరపుకోట పంచాయతీలోని కొండగూడెం గ్రామ సచివాలయం వద్ద రెవెన్యూ గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఫిర్యాదులపై విచారణ జరుపుతామని, అందు కు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తామని తహశీల్దార్ స్పష్టం చేశారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, వీఆర్వోలు పాల్గొన్నారు.

టి.నరసాపురం: రైతులు రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ టి.ఎస్ సాయిబాబా తెలిపారు. మక్కినవారిగూడెంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించి రైతుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రెవిన్యూ సదస్సులో పట్టాదార్ పాస్‌పుస్తకంలో పేర్లు తప్పులు, ఆధార్‌లింక్ అవ్వనివి, పట్టా ఇచ్చి భూమి చూపించక పోవడం, మ్యుటేషన్, అడంగల్ కలెక్షన్లు వంటి 26 దరఖాస్తులు అందినట్లు ఆయన తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడికి జీవిత ఖైదు

బాధితురాలికి రూ.3లక్షల పరిహారం ఇవ్వాలని కోర్టు ఆదేశం

ఏలూరు క్రైం/దెందులూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్ల బాలికపై 50 ఏళ్ళపైబడిన వ్యక్తి అత్యాచారానికి పాల్పడిన నేరం రుజువు కావడంతో యావజ్జీవ కారాగార శిక్ష, ఐదు వేల రూపాయల జరిమానా విధిస్తూ ఏలూరులోని పోక్సో కోర్టు జడ్జి ఉమాసునంద తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం దెందులూరు మండలంలోని ఒక గ్రామానికి చెందిన బాలిక తల్లి అనారోగ్యంతో మృతి చెందింది. తండ్రి చెడు వ్యసనాలకు బానిసై పిల్లలను చూడకపోవడంతో నాయనమ్మ వద్ద ఉంటున్నారు. దెందులూరుకు చెందిన నున్నా ఆంతోనీ రాజు (51) చిల్లర కొట్టువద్దకు 2022 అక్టోబర్ 8న బాలిక వెళ్లింది. ఒంటరిగా వచ్చిన బాలికను ఆంతోనిరాజు బలవంతంగా తన ఇంట్లోకి తీసుకువెళ్ళి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక ఎంత సేపటికి తిరిగి రాకపోవడంతో నాయనమ్మ వెళ్ళి చూసింది. అతడి ఇంట్లో బాలిక ఉండడాన్ని గమనించింది. బాలిక జరిగిన విషయం చెప్పడంతో దెందులూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ వీర్రాజు కేసు నమోదు చేశారు. అప్పటి మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ కె సత్యనారాయణ ఆంతోనిరాజును అరెస్టు చేశారు. ఈ కేసు ఏలూరులోని పోక్సో కోర్టులో విచారణ సాగింది. నిందితుడు నున్నా అంతోనిరాజుపై నేరం రుజువు కావడంతో అతడికి యావజ్జీ కఠిన గారాగార శిక్ష, ఐదు వేల రూపాయలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరు నెలలు అదనంగా శిక్ష అనుభవించాలన్నారు.

బాధితురాలికి మూడు లక్షల రూపాయలు పరిహారం ప్రభుత్వం ఇవ్వాలని ఉత్తర్వుల్లో న్యాయమూర్తి పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్‌కు అప్పటి ఎస్ఐ కె.స్వామి, ప్రస్తుతం ఎస్ఐ శివాజీ, కోర్టు కానిస్టేబుళ్ళు శ్రీకాంత్, దిలీప్, కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌స్పెక్టర్ ఎం సుబ్బారావు, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు, మహిళా హెడ్ కానిస్టేబుల్ ఎంవి రమణ, కానిస్టేబుల్ రవికుమార్, ఎఎస్ఐ సిసిలి, ఎఎస్ఐ రుక్మంధనరావు ప్రాసిక్యూషన్‌కు సహకరించారు. వీరందరిని ఎస్పీ కెపిఎస్ కిశోర్ అభినందించారు.

ప్రేమ పేరుతో బాలికపై వేధింపులు

పోక్సో చట్టం కేసు నమోదు

తణుకు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రైవేటు స్కూలులో తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికను ఒక వ్యక్తి ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. బాలిక తల్లి ఫిర్యాదుతో పోక్సో చట్టం కింద పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. తణుకు పట్టణానికి చెందిన తలపాకుల ప్రేమ్‌కుమార్ తరచు బాలిక వెంటపడి ప్రేమించాలని వేధిస్తున్నాడు. అతడి వేధింపులతో భయపడిన బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో

ప్రసవానికి లంచం డిమాండ్

ఉద్యోగులు సొమ్ము వసూలు చేస్తుండగా వీడియో తీసిన మహిళ

ఉన్నతాధికారులకు ఫిర్యాదుతో ఆస్పత్రిలో విచారణ



ఆస్పత్రిలో వివరాలు తెలుసుకుంటున్న తహసీల్దార్

ఏలూరు క్రైం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో కొద్ది రోజుల క్రితం జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి రెండు గంటల పాటు పరిశీలించారు. అవినీతి జరిగితే సహించేది లేదని హెచ్చరికలు జారీ చేశారు. అయినా ఆసుపత్రి మాతా శిశు విభాగం ఉద్యోగుల తీరు మారలేదు. వారికి లంచం ఇవ్వనిదే ఏ పని జరగదని ప్రచారం కూడా ఉంది.

ఒక మహిళ ప్రసవానికి ఆస్పత్రికి వెళితే ఆమె బంధువుల వద్ద నుంచి అడుగడుగునా ఆసుపత్రి ఉద్యోగులు లంచం వసూలు చేశారని ఆ మహిళ ఆరోపించింది. ఒక వీడియో తీసి ఉన్నతాధికారులకు పంపించడంతో జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి విచారణకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఏలూరు అర్బన్ తహసిల్దార్ శేషగిరి శుక్రవారం ఆసుపత్రి చేరుకుని సాయంత్రం 6.30 గంటల వరకూ ప్రాథమిక విచారణ చేశారు. తల్లి బిడ్డల విభాగాన్ని అడు గడుగునా ఆయన పరిశీలించి వివరాలు సేకరించారు. పెదపాడు మండలం కొత్తూరు గ్రామానికి చెందిన ఒక మహిళ ఎంసిహెచ్ విభాగంలో ప్రసవం కోసం చేరింది. ఆమెకు సాధారణ ప్రసవమైంది. ఆమె బంధువు లావణ్య నుంచి అక్కడ పనిచేసే ఎఫ్ఎన్‌వో (జీడీఏ) రూ.500 లంచం తీసుకున్నారని వీడియో తీసి పెట్టారు. అంతేకాకుండా అడుగడుగునా అక్కడ సిబ్బంది లంచాలు అడిగిన విధానాన్ని ఆమె వీడియో ద్వారా తెలియజేశారు. ఈ సంఘటనపై విచారణకు కలెక్టర్ తక్షణం ఆదేశాలు జారీ చేశారు. తహసీల్దార్ శేషగిరి ఆసుపత్రికి చేరుకుని లావణ్య వాఙ్మూలం నమోదు చేశారు. ఈ నెల 18న పూర్తిస్థాయి విచారణకు ముగ్గురు వైద్యుల బృందంతో కమిటీని ఏర్పాటు చేశారు. అక్కడ ఎవరు ఎంత లంచం తీసుకున్నారనేది విచారణ కమిటీ నిగ్గు తేల్చనుంది. ఈ సందర్భంగా ఏలూరు అర్బన్ తహసీల్దార్ శేషగిరి ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు తాను ప్రాథమిక విచారణ జరిపానని ఈనెల 18న పూర్తి స్థాయి విచారణ అనంతరం నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేయనున్నామని చెప్పారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్య

- చిత్తపూరు యువతి హైదరాబాద్‌లో మృతి
- భార్యాభర్తల గొడవలే కారణమా?

చాట్రాయి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా చాట్రాయి మండలం చిత్తపూరు గ్రామానికి చెందిన మొక్కపాటి నాగలక్ష్మి(29) హైదరాబాద్ మియాపూర్‌లో విషం తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. చిత్తపూరు గ్రామానికి చెందిన మొక్కపాటి శ్రీనివాసరావు కుమార్తె నాగలక్ష్మి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్నారు. లింగపాలెం మండలం తువ్వచిలక గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ మొవ్వ మనోజ్ మణికంఠతో 5 నెలల క్రితం వివాహమైంది. మియాపూర్ గోపాలరావు నగర్ కాలనీలో నివాసం ఉంటున్న దంపతుల మధ్య కొన్ని రోజుల నుంచి గొడవలు జరుగుతున్నాయి. దీనితో మనస్తాపం చెందిన నాగలక్ష్మి గత నెల 26న ఆన్‌లైన్‌లో విష పదార్థం తెప్పించుకుంది. ఈ నెల 11న కూడా గొడవ జరగడంతో నాగలక్ష్మి ఎవరూ లేని సమయంలో విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన ఇంటి యజమాని, అతని కుటుంబ సభ్యులు కేపీహెచ్‌బీలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి ఆమె మృతి చెందింది. భర్త వేధింపులు తట్టుకోలేకే తమ కుమార్తె నాగలక్ష్మి ఆత్మహత్యకు పాల్పడిందని తల్లిదండ్రులు మియాపూర్ పోలీస్‌స్టేసన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిత్తపూరులో విషాదఛాయలు

సామాన్య రైతు మొక్కపాటి శ్రీనివాసరావు పెద్ద కుమార్తె నాగలక్ష్మి హైదరాబాద్‌లో ఆత్మహత్యకు పాల్పడడంతో చిత్తపూరులో విషాఛాయలు అలుముకున్నాయి. శ్రీనివాసరావు ముగ్గురు కుమార్తెలను ఉన్నత చదువులు చదివించారు. రెండో కుమార్తెకు కూడా వివాహం కాగా మూడో కుమార్తె అమెరికాలో చదువుతోంది. అందరితో కలివిడిగా ఉండే శ్రీనివాసరావు కుటుంబంలో విషాదంతో బంధువులు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని గ్రామానికి తీసుకురానున్నారు.



ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీ

ఏలూరు క్రైం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై విజిలెన్స్ అధికారులు శుక్రవారం విస్తృత తనిఖీ చేశారు. విజిలెన్స్ డీఎస్పీ సింగులూరి వెంకటేశ్వరరావు, విజిలెన్స్ డీఈఈ పి.శ్రీనివాసన్, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్స్ శివరామకృష్ణ, డి ప్రసాద్‌కుమార్, ఏజీ వి.శ్రీధర్, ఏఈ పి.శ్రీనివాసరావు, ఎఈఈ ఎం.రూపేష్‌వర్మ, ఎస్ఐ సీహెచ్ రంజిత్‌కుమార్, వ్యవసాయ, రెవెన్యూ అధికారులు బృందాలుగా తనిఖీలు చేపట్టారు. ఏలూరు నగరంలో తుంపాల ఎరువుల డిపోలో రూ.2.8 లక్షల విలువైన 12.25 మెట్రిక్ టన్నుల ఎరువులు భౌతిక నిల్వల్లో వ్యత్యాసాన్ని గుర్తించి స్టాక్‌ను సీజ్ చేశారు. తాడేపల్లిగూడెం పట్టణంలో నిర్వహిస్తున్న జోషిక ఎంటర్ ప్రైజెస్‌లో రూ.36,93,525 విలువైన 128 మెట్రిక్ టన్నుల ఎరువులు భౌతిక నిల్వల్లో వ్యత్యాసం, రూ. 38,73,326 విలువైన 2,039 లీటర్ల బయో స్టీమ్‌లెన్‌ను గుర్తించి సీజ్ చేశారు. పెనుమంట్ర మండలం వెలగలేరులో గ్రంధి రామలింగేశ్వర రావు కంపెనీలో రూ.6,72,120 విలువైన 30.55 మెట్రిక్ టన్నుల ఎరువులు భౌతిక నిల్వల్లో వ్యత్యాసం ఉండడంతో స్టాక్‌ను సీజ్ చేశారు. ఈ మూడు షాపులపై ఫెర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్ 1985, సెక్షన్ 6(ఎ) నిత్యావసర వస్తువుల చట్టం 1955 ప్రకారం కేసులు నమోదు చేశారు.

మాదిగల ఆర్థికాభివృద్ధికి రూ.340 కోట్లు

మంత్రి కొలుసు పార్థసారథి



మాదిగ జేఏసీ ఆత్మీయ కలయిక సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి, మంద కృష్ణ

నూజివీడు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మాదిగల ఆర్థికాభివృద్ధికి రూ.340 కోట్లు కేటాయించిన ఘనత టీడీపీ కూటమి ప్రభుత్వానిదేనని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు నియోజకవర్గ మాదిగల ఐక్య కార్యాచరణ సమితి ఆత్మీయ కలయిక సమావేశంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగతో కలిసి శుక్రవారం ఆయన పాల్గొన్నారు.

పేద, బడుగు, బలహీన వర్గాలు, దళితులు తలెత్తుకొని బతికేలా చేసే బాధ్యతను కూటమి ప్రభుత్వం ద్వారా తీసుకుంటున్నానని చెప్పారు. మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా వస్తున్న రిజర్వేషన్లను ఎస్సీల్లోని 59 కులాలు అనుభవించాలనేదే ఎమ్మార్పీఎస్ వాదన అన్నారు. ఒకే వర్గం అనుభవించాలనేది మాలల వాదన అన్నారు. మాదిగల వాదనలో సోదర భావన ఉంటే మాలల వాదనలో స్వార్థం ఉందన్నారు. దీన్ని అడ్డుకునే ప్రయత్నంలో దాదాపు 30 ఏళ్ల పోరాటం చేసి ముందుకు సాగుతున్నామన్నారు. ఎస్సీలలో అన్యాయం జరిగిన వారికే ప్రాధాన్యతనివ్వాలనేదే తమ వాదన అన్నారు. కార్యక్రమంలో తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలు సమర్థవంతంగా జరపాలి

మునునూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం జరిగే నీటి సంఘాల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని ఎంపీడీవో జి.రాణి అన్నారు. చింతవల్లి ఎంపియూపీ పాఠశాలలో 56వ పోలింగ్ కేంద్రంలో సౌకర్యాలను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఒక మేజర్, 16 మైనర్ ఇరిగేషన్ చెరువులకు సంబంధించి అధ్యక్షులు, ఉపాధ్యక్షుల ఎన్నికకు 11,032 మంది రైతులు ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు ఆమె తెలిపారు. రైతులందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎంపీడీవో కోరారు.

● చాట్రాయి: మండలంలో 19 సాగునీటి సంఘాలకు శనివారం ఎన్నికలు జరగనున్నాయి. మేజర్ సాగునీటి సంఘం ఒకటి, మీడియం, మైనర్ సంఘాలు 18 మొత్తం 19 సంఘలకు ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు చేశారు. మంత్రి కొలుసు పార్థసారథి గ్రామాల వారీగా కూటమి నాయకులతో సమావేశాలు నిర్వహించి ఏకాభిప్రాయానికి కృషి చేశారు. అన్ని సంఘాలు ఏకగ్రీవం అవుతాయని కూటమి నాయకులు అంటున్నారు.

బాధితులకు న్యాయం చేయాలి

ముసునూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): చింతలవల్లి భూ వివాదంలో గాయపడిన మహిళలకు న్యాయం చేయాలని సీపీఐ నాయకుడు నిమ్మగడ్డ నరసింహ డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద బాధిత కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం ధర్నా నిర్వహించారు. దేరంగుల సరళ స్థలంలో రేకుల షెడ్ నిర్మాణం చేస్తున్న క్రమంలో ఆదే గ్రామానికి ఏనుగుదాటి నాగరాజు సరళ, ఆమె కోడలు స్రవంతిపై కర్రతో దాడి చేశాడన్నారు. వారు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, లేకుంటే కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేస్తామని నిమ్మగడ్డ హెచ్చరించారు. డీటీ రమణకు వినతపత్రం అందజేశారు.

హేకథాన్ విజేతలు.. ట్రిపుల్ ఐటీ విద్యార్థులు



రూ.లక్ష నగదు ప్రోత్సాహకం అందుకున్న విద్యార్థులు

నూజివీడు టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ హేకథాన్‌లో ఆర్జీయుకేటీ నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. చత్తీస్‌గడ్‌లోని భిలాయ్‌లో నిర్వహించిన స్మార్ట్ హేక్‌థాన్ వివరాలు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ అమరేంద్ర కుమార్ శుక్రవారం తెలిపారు. ట్రిపుల్ ఐటీ విద్యార్థుల జట్టు డైనమిక్ రూట్ రేషనలైజేషన్‌పై ప్రాజెక్టును సమర్పించి రూ.లక్ష బహుమతి గెలుచుకున్నారన్నారు. విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఏవో బి.లక్ష్మణరావు, డీన్ రత్నాకర్, శ్యామ్ పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీపై వర్క్‌షాపు

సైబర్ సెక్యూరిటీపై నూజివీడు ట్రిపుల్ ఐటీలో వర్క్‌షాపు నిర్వహించారు. సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ అడ్వాన్స్ కంప్యూటింగ్ - హైదరాబాద్ సంస్థ ఆధ్వర్యంలో ఈవర్క్‌షాపును నిర్వహించారు.

పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

ముసునూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి పసల్ బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో ఎస్.మధు మోహన్ అన్నారు. ముసునూరు, చెక్కపల్లి, గోపవరం తదితర గ్రామాల్లో మొక్కజొన్న పంటను శుక్రవారం ఆయన పరిశీలించారు. రబీ సీజన్‌లో వరి, మొక్కజొన్న, మినుము, పెసర పంటలకు మాత్రమే పంట బీమా ప్రీమియం చెల్లించేందుకు అవకాశం ఉందన్నారు. వరికి ఎకరానికి రూ 500, మొక్కజొన్నకు రూ.483, మినుము, పెసర పంటలకు రూ.60 ప్రీమియం చెల్లించాలన్నారు. కౌలు రైతులు కూడా ఈ పథకానికి అర్హులేనని అన్నారు. వరికి ప్రీమియం చెల్లించడానికి ఈ నెల 31, మిగిలిన పంటలకు ఈ నెల 15 గడువు అన్నారు. రైతులందరూ గడువులోపు ప్రీమియం చెల్లించాలన్నారు.

కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేసేది టీడీపీ ప్రభుత్వమే

నూజివీడు టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కేంద్రీయ విద్యాలయాన్ని ఏర్పాటు చేసేది టీడీపీనే అని నూజివీడు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గా ప్రసాద్ అన్నారు. ఆయన కార్యాలయంలో శుక్రవారం మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మెడికల్ కళాశాల తీసుకువస్తానని రింగ్ రోడ్డు నిర్మాణం అంటూ నూజివీడు ప్రజలను ప్రతాప్ మభ్య పెట్టారన్నారు. నిర్మాణాత్మక ప్రతిపక్షంగా నూజివీడు అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కృషి చేస్తే బాగుంటుందని అభివృద్ధి నిరోధకులుగా మారవద్దని హితవు పలికారు. కేంద్రీయ విద్యాలయం తాత్కాలిక భవనాలు పేరుతో వైసీపీ ప్రభుత్వం లో నిధులు ఖర్చు చేసినా కేంద్రీయ విద్యాలయం రాలేదన్నారు. ఆ భవనాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సారథి సూచించారని నేడు కేంద్ర ప్రభుత్వం కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరు చేయడంతో తాత్కాలిక భవనాలను యథాతథ స్థితిలో ఉంచాలని సూచించిన విషయాన్ని ప్రతిపక్ష నాయకులు గుర్తించాలన్నారు. పాదం సత్యనారాయణ, మల్లిశెట్టి జగదీష్, పల్లె నాగరాజు, తిరుమలశెట్టి ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.



వణుదుర్రులో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న ప్రత్యేకాధికారి శ్రీనివాస్, తహసీల్దార్ సుబాని



కోరుకొల్లు రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి ప్రభాకర్

భూ సమస్య లేని రైతులే ప్రభుత్వ లక్ష్యం

కార్మిక శాఖ డీసీ శ్రీనివాస్

ముదినేపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్వార్జితంగా సంపాదించుకున్న, వారసత్వంగా వచ్చిన భూములకు సంబంధించి రైతులు ఎటువంటి సమస్యలు ఎదుర్కొకూడదన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యమని జిల్లా కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్, ముదినేపల్లి మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ తెలిపారు. ఆయన శుక్రవారం తహసీల్దార్ సుభానీతో కలసి వణుదుర్రు, పెదగొన్నూరులో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. భూముల సరిహద్దులు, సర్వేకు సంబంధించి పలువురు అర్జీలు అందజేశారు. భూములకు సంబంధించి సమస్యలు లేనప్పుడే రైతులు ప్రశాంతంగా వ్యవసాయం చేయగలరని, అందుకే ప్రభుత్వం మీ భూమి - మీ హక్కు పేరుతో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెదగొన్నూరులో జరిగిన రెవెన్యూ సదస్సులో తన భూమి సంబంధించి అన్ని పత్రాలు ఉన్నప్పటికీ 31 సెంట్లు తక్కువగా ఆన్‌లైన్‌లో చూపిస్తోందని పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు శ్రవణం శివ ప్రసాద్ అర్జీ అందజేయగా, దీనిపై చర్యలు తీసుకోవాలని ప్రత్యేక అధికారి ఆదేశించారు.

కోరుకొల్లులో 75 అర్జీలు

కలిదిండి : కోరుకొల్లులో జరిగిన రెవెన్యూ సదస్సుకు భూ సమస్యలపై 75 అర్జీలు వచ్చాయని మండల ప్రత్యేకాధికారి బి.ప్రభాకర్ తెలిపారు. సర్పంచ్ బట్టు లీలా కనకదుర్గ, తహసీల్దార్ రామకృష్ణ, ఆర్ఐ శ్యామల, మాజీ ఎంపీపీ వలవల రామారావు, కేశిరెడ్డి బలరామ్, ఎంపీటీసీలు రమాదేవి, శిరీష, వీఆర్వోలు రాజబాబు, కాంతారావు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

ముదినేపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలంలోని 13 సాగునీటి వినియోగదారుల సంఘాల పాలక వర్గాలకు శనివారం ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ సుభానీ తెలిపారు. మండలంలోని 134 సంఘాల ప్రాదేశిక నియోజకవర్గాలు, 13 సంఘాలు, 2 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. 16 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసి ఎన్నికల నిర్వహణకు సుమారు 300 మంది అధికారులు, సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. పోలింగ్ స్టేషన్ల వద్ద బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ వీరభద్రరావు తెలిపారు.

కలిదిండి : మండలంలో 12 నీటి సంఘాలకు శనివారం జరిగే ఎన్నికలకు సర్వం సిద్ధం చేశామని తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు. ఈ ఎన్నికల నిర్వహణకు 9 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 12 నీటి సంఘాలకు జరిగే ఎన్నికలకు 15,217 మంది రైతులు ఓటు హక్కు వినియోగించుకుంటా రన్నారు.

మండవల్లి : మండలంలో పది నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిం చేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. మండలంలో పది పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 15,860మంది ఓటర్లు ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అయితే దాదాపు అన్ని సంఘాలను ఏకగ్రీవంగా చేసేందుకు మండలంలోని ఎన్డీఏ నాయకుడు దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ప్రయత్నాలు ప్రారంభించారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్య హవనం

ముదినేపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): షష్టి కల్యాణోత్సవాల్లో భాగంగా సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవ స్థానంలో శుక్రవారం 'సుబ్రహ్మణ్య హవనం' వైభవంగా జరిగింది. దేవస్థానం మంటపంలో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.గంగా శ్రీదేవి, ఉత్సవ కమిటీ సభ్యులు బొంగు రవికుమార్, పరసా రమేష్, వెనిగళ్ల సురేష్, కొట్టి సుబ్బలక్ష్మి, దగాని నాగలక్ష్మి, శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు పూజలు నిర్వహించారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ దంపతులు పుట్టలో పాలుపోసి పూజలు జరిపారు.



సింగరాయపాలెం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న హవనం

పెయ్యేరులో అన్న సమారాధన

పెయ్యేరులోని వల్లీదేవసేన సమేత పంచముఖ శిక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద షష్టి కల్యాణోత్సవాల ముగింపు సందర్భంగా దేవస్థానం కమిటీ ప్రతినిధులు వల్లభనేని గౌరీ శంకర్, నల్లమోతు ప్రసాద్, సాక్షి సాయిబాబు ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు.

ఘనంగా హనుమాన్ చాలీసా

ముదినేపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లిలోని సీతారామచంద్రస్వామి దేవస్థానం (పెద రామాలయం)లో శుక్రవారం హనుమద్ వ్రతం, హనుమాన్ చాలీసా కార్య క్రమాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక మహిళలు అంజనేయస్వామికి పూజలు నిర్వహించి 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. బృందావనం శ్రీనివాసాచార్యులు పూజలు, అభిషేకాలు జరిపారు. ఆలయ అభి వృద్ధి కమిటీ సభ్యులు గాంధీ, రాజేంద్ర ప్రసాద్, కృష్ణాజీరావు, బీజేపీ నియోజకవర్గ కో-కన్వీనర్ సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కోలుకున్న విద్యార్థులు

ఆసుపత్రి నుంచి డిశ్చార్జి

చాట్రాయి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటపాడు ఎంపీయుపీ స్కూల్‌లో మధ్యాహ్న భోజనం వికటించి అస్వస్థతతో, నూజివీడు ఏరియా ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్న 9 మంది విద్యార్థులు శుక్రవారం డిశార్చి అయ్యారు. డీఈవో ఎం.వెంకటలక్ష్మి శుక్రవారం నూజివీడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. విద్యార్థులు ఆసుపత్రి నుంచి నేరుగా స్కూల్‌కు రాగా పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ విజయలక్ష్మి, దుర్గాప్రసాద్ వారికి పరీక్షలు జరిపి ఆరోగ్యంగా ఉన్నారని చెప్పారు. అంతకు ముందు జిల్లా సర్వేలెన్స్ అధికారి నరేంద్రకృష్ణ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం వంట పాత్రలు, వాటర్ ట్యాంకు, ఆర్‌వో ప్లాంటును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో బ్రహ్మచారి, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ముసునూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం చెక్కపల్లికి చెందిన కురెళ్ళ వెంకటేశ్వరరావు (62) బైక్‌పై ఈ నెల 9న అక్కిరెడ్డిగూడెం నుంచి వస్తుండగా అదుపుతప్పి పడిపోయాడు. తీవ్ర గాయాలైన అతడిని స్థానికులు 108 వాహనంపై నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వెంకటేశ్వరావు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

డ్రైవర్‌కు మూడు నెలల జైలు

నూజివీడు టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కారును నిర్లక్ష్యంగా నడిపి ఒకరి మృతికి కారణమైన డ్రైవర్ డి.శ్రీనివాసరావుకు మూడు నెలల జైలు శిక్ష విధిస్తూ నూజివీడు స్పెషల్ మెజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ ప్రకారం 2019 ఫిబ్రవరి 21న భోజన హోటల్ వద్ద రోడ్డు దాటుతున్న నల్లమలం గోపాలంను ఏలూరు నుంచి కారులో వస్తున్న డి.శ్రీనివాసరావు బలంగా ఢీకొనడంతో మృతి చెందాడు. హనుమాన్‌జంక్షన్ నిందితుడికి మూడు నెలలు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

నేడు లోక్ అదాలత్

నూజివీడు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాజీమార్గం ద్వారా పరిష్కరించదగ్గ కేసులను శనివారం నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని మండల న్యాయసేవా అధికార సంస్థ చైర్మన్ ఎ.నాగశైలజ సూచించారు. రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవడం ద్వారా కక్షిదారులు ఆర్థిక భారంనుంచి బయటపడడంతో పాటు అమూల్యమైనటువంటి కోర్టు సమయాన్ని కాపాడిన వారు అవుతారన్నారు. శనివారం నిర్వహిస్తున్న జాతీయలోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

భోగేశ్వరస్వామి హుండీ ఆదాయం లెక్కింపు

కలిదిండి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కలిదిండిలో ఉన్న పాతాళ భోగేశ్వరస్వామి హుండీకి సంబంధించి తొమ్మిది నెలల ఆదాయాన్ని లెక్కించగా రూ.5,17,580 వచ్చిందని ఆలయ ఈవో శేఖర్ తెలిపారు. లెక్కింపులో దేవదాయ శాఖ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా దాసాంజనేయ స్వామి కల్యాణం

కైకలూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి):కైకలూరు కోరుకొల్లు రోడ్డులో కొలువై ఉన్న శ్రీ సువర్చల సహిత దాసాంజనేయస్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శుక్రవారం స్వామికి పంచామృతాలతో అభిషేకాలు, సహస్రనామ అష్టోత్తర శతనామ పూజలు చేశారు. అనంతరం ఆలయం ముందు ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో స్వామి కల్యాణ మహోత్సవాన్ని చిట్టి పార్వతీశం హేమలత దంపతులు చేతుల మీదుగా నిర్వహించారు. మహిళలు, భక్తులు పెద్దఎత్తున ఈ కల్యాణ మహోత్స వాన్ని తిలకించేందుకు తరలివచ్చారు. ఆల య అర్చకులు పరిమి శివయ్య కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాట్లను నిర్వహించారు.

ఘనంగా సెమీ క్రిస్మస్

ముదినేపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సింగరాయపాలెం సీఎస్ఐ చర్చిలో శుక్రవారం రాత్రి సెమీక్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. చర్చి పాస్టర్ సుగుణరావు ఆధ్వర్యంలో క్రైస్త వులు ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన వివిధ రకాల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకోగా, క్రీస్తు శాంతి సందేశం అనుసరణీయం కావాలని పాస్టర్లు పేర్కొన్నారు.